నల్లకారు

ఎమ్. వి. వి. సత్యనారాయణ

పట్నానికి ఒక మూలగా అభివృద్ధి చెందుతోన్న ప్రాంతం అది. మూడువైపులా విస్తరించుకొన్నపట్నం ఎగుడుదిగుడుగా కనిపిస్తోంది. నాలుగోవైపున విశాలమైన కొండ తూర్పున సముద్రంవరకూ పరచుకుని పండుకుని వుంది.

ఒకే రకంగా నిర్మించిన ఇళ్ళు వున్న ఆ కాలనీ హౌసింగ్ బోర్డు వారిది. ఇళ్ళు జనంతో పూర్తిగా నిండ లేదు కాని ఆ కాలనీలో ఒక మాదిరి బార్ వెలసింది.

లోయ అంచునవున్న బార్ కి. దగ్గరలోనే దట్టంగా పెరిగిన చిట్టడవి వుంది. కాలనీలో చెదరు మదురుగా కిళ్ళీ షాపులూ, ఒక లాండ్రీ, రెండు కిరణాకొట్లు వెలి శాయి. వాటికి కాస్త మధ్యగా బాంక్ భవనం కూడా చోటు చేసుకుంది. తీర్చిదిద్దిన తారురోడ్లమీద సిమెంట్ ఎలక్ట్రిక్ స్తంభాలు నాగరికతకు సాక్ష్యంగా నిల బడ్డాయి.

4

మధ్యాహ్నం పదకొండు గంటల సమయం.

నిషా బార్ ముందు ఆటో ఆగింది.

ఆటోలోంచి భూషణం దిగి డ్రైవర్‌కి అద్దె చెల్లించాడు. రోడ్డుకేసి చూశాడు. ఒకరో ఇద్దరో నడుస్తున్నారు. తప్పితే నిర్జనం అనే చెప్పుకోవాలి. కాలనీకి వెనకవున్న కొండమీద ఎండ ప్రతిఫలించి కాలనీలో అప్పుడే వేడి గాలిని విసురుతోంది.

భూషణం చేతిలోవున్న బాగ్ తడిమి తృప్తిగా చూచి, బార్ కేసి నడిచాడు.

నిషాబార్‌లో జనం లేరు. కౌంటర్ ఖాళీగా వెక్కిరిస్తోంది. కుర్చీలు తలక్రిందులుగా బెంచీల మీదా, టేబుల్స్‌మీద విశ్రాంతి తీసుకొంటున్నాయి. హాలు అప్పుడే శుభ్రం చేసినట్టుంది. మద్యం వాసనతో బాటు ఫెనాయిలు వాసన కలగాపులగంగా వస్తోంది.

భూషణం కౌంటర్ ముందు నిలబడ్డాడు. ఎవరూ అతడి దగ్గరకు రావడంగానీ అతడి వునికిని గుర్తించడం కానీ జరగలేదు.

"సుబ్బరామయ్యా," పిల్చాడు భూషణం.

సుబ్బరామయ్య ఆ బార్ యజమాని.

ఎవరూ జవాబు పలకలేదు. భూషణం హాలులోంచి లోపలికి నడిచాడు.

వంటయింట్లో పొయ్యి మండుతోంది. పొయ్యి మీద పెద్దసైజు గంగాళంలో నిండుగా నూనె మరుగుతోంది. క్రింద ఒక ప్రక్కగా మసాలా కలిపిన పాత్ర వుంది. దాని ప్రక్కనే వుల్లిపాయ ముక్కల రాశి వుంది. ఆ రాశి మీద పచ్చి మిరపకాయ ముక్కలు పేర్చినట్టు వున్నాయి. గది గోడలు మసిబారి వున్నాయి. అయినా ఆ గదిలో

వస్తోన్న వాసనలు ఎంత ఆకలి చచ్చిపోయిన వాడికయినా అవురావురుమనే ఆకలి పుట్టించేలాగా వున్నాయి.

వంటయింట్లో యెవరూ లేకపోవడంతో ఆ గదిని దాటుకుంటూ ముందుకు నడిచాడు భూషణం.

వంటయింటికి వెనకగా పెరడు వుంది. పెరట్లో నుయ్యి దగ్గర వంటవాడు కోళ్ళను తలలు కట్ చేసి ఒక ప్రక్కగా పెడుతున్నాడు. కన్నన్ నీళ్ళు తోడుతున్నాడు. వాళ్ళిద్దరూ తమ పనులు ఆపకుండానే భూషణంకేసి చూశారు.

భూషణం వాళ్ళని పలకరింపుగా నవ్వి, "రాత్రికి కార్యక్రమం సిద్ధం చేస్తోన్నట్టున్నారు." అన్నాడు.

వంటవాడు కోళ్ళను చంపేపని అయిపోయినట్టుగా పెద్ద కత్తిని ఒకప్రక్కగా పెట్టి లేచాడు. నల్లటి ఇనుప కత్తి రక్తంతో తడిసి ఎర్రగా చందనం పూసుకున్నట్టుంది. చివరిగా తల తెగిన కోడి యింకా గిలగిల కొట్టుకుంటూ నేలమీద పొర్లుతోంది.

"అవునండి! చెయ్యాలికదా!" అన్నాడు సమాధానంగా.

"సుబ్బరామయ్య ఎక్కడికి వెళ్ళాడు?" అడిగాడు భూషణం.

"టవున్ వెళ్ళారు. పలావ్ రైస్ మంచిరకం వచ్చాయట!" అన్నాడు కన్నన్.

"సుబ్బరామయ్య వచ్చేవరకూ బాటిల్ దొరకదా?"

"తాళం చెవులు ఇచ్చి వెళ్ళారు."

"వెరీగుడ్! చికెన్ యెంతసేపట్లో అవుతుంది?"

"ఇప్పుడప్పుడే యెక్కడ సార్?" వంటవాడు నిర్లక్ష్యంగా కోళ్ళను కాళ్ళు పట్టి మోసుకు వెళ్ళిపోయాడు.

6

భూషణం వంటవాడు వెళ్ళిన దిశకేసి కోపంగా చూచి "వీడికి యింకా బుద్ధి రాలేనట్టుంది. కష్టమర్స్‌తో యింత తల బిరుసుగా మాట్లాడతాడేం?" అన్నాడు.

కణ్ణన్ చాలా మామూలుగా నవ్వి, "వాడికి కష్టమర్స్‌తో పనేమిటి సార్! బేరర్‌ని నేను కాబట్టి నాకే కష్టమర్స్‌పట్ల గౌరవం వుండాలి." అన్నాడు.

"సరే! ఒక కోడిని త్వరగా ఫ్రై చేయించు. బహుమతి మర్చిపోలేదని చెప్పు. జానీవాకర్ బాటిల్ తీసి వుంచు" అన్నాడు భూషణం.

కణ్ణన్ కళ్ళెగరేసి, "జానీవాకరే! ఏమిటి సార్ విశేషం?" అన్నాడు.

"విశేషం ఏముంది? ఏం? నేను జానీవాకర్ తాగకూడదా?"

"ఏం లేదుసార్! ఎప్పుడూ జానీవాకర్ గురించి మీరు అడగలేదని ఆశ్చర్యపోయాను. అంతే!"

కణ్ణన్ నీళ్ళు నిండిన బకెట్లు రెండు చేతులతో పట్టుకుని వంటయింట్లోకి నడిచాడు. భూషణం అతడిని అనుసరించుకుంటూ వంటింట్లోకి వచ్చాడు. కణ్ణన్ బకెట్లు వంటయింట్లో దింపి హాల్లోకి నడిచాడు. భూషణం హాల్లో అడుగు పెడుతూనే, "సుశీల వుండే గది ఎక్కడ?" అన్నాడు.

కణ్ణన్ మాట్లాడలేదు.

భూషణం బాగ్ తెరచి నోట్ల కట్టల్లోంచి అయిదు రూపాయల నోటుతీసి కణ్ణన్ చేతిలో పెట్టాడు. కణ్ణన్ మొహం మెర్క్యూరీ దీపంలాగా తళ తళలాడింది. చటుక్కున నోటు అందుకుని బనీను జేబులో పెట్టుకున్నాడు.

"రాత్రంతా అలసిపోయి వుంటుంది. ఇప్పుడు నిద్ర లేస్తుందని నాకు నమ్మకం లేదు సార్!" అన్నాడు కణ్ణన్ వినయంగా.

"ఆ సంగతి నేను చూసుకుంటాను. నాకు ఆమె గది చూపించు చాలు" అన్నాడు భూషణం బాగ్ మూసి.

"రండిసార్!" కణ్ణన్ హాల్లోంచి ప్రక్కకి నడిచాడు. భూషణం బాగ్‌ను జాగ్రత్తగా గుండెలకదుముకుని కణ్ణన్ వెనకనే నడిచాడు.

గుమ్మంలో అంతవరకూ వాళ్ళిద్దరినీ పరీక్షగా చూస్తోన్న వంటవాడు అసహ్యంగా వుమ్మి తిరిగి తన పనిలో నిమగ్నమమైపోయాడు.

2

భూషణం తలుపు తట్టాడు. లోపలనుండి యెవరో కదిలిన సూచనగా మంచం కిర్రుమంది. భూషణం తిరిగి తలుపు తట్టాడు. లోపలవున్నవాళ్ళు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటోన్నట్టనిపించింది.

"ఎవరు?" చిరాగ్గా అడిగింది ఆడగొంతు.

"సుశీలా! నేను భూషణాన్ని. తలుపు తెరువు."

"ఇప్పుడా? ఒకగంట ఆగి రారాదూ!" చిరాగ్గా అంది సుశీల.

"తలుపు తెరువ్. నీతో అర్జంటుగా మాట్లాడాలి."

"అబ్బా....బద్ధకంగా వుంది" సుశీల లేచినట్టుంది. గుమ్మంవద్ద మెత్తగా అడుగుల చప్పుడయింది. భూషణం ఆత్రుతగా తలుపులకేసి చూడసాగాడు.

తలుపులు తెరుచుకున్నాయి. సుశీల గుమ్మం అవతల నిలబడివుంది. రోజ్ కలర్ బ్లవుజ్, పూల పరికిణీ కట్టుకునివుంది. బ్లౌజ్‌కీ పూల పరికిణీకి మధ్య జానెడు వెడల్పున

నగ్న శరీరం నున్నగా మెరుస్తోంది. గాఢమైన నిద్ర లోంచి లేచినట్టు ఆమె కళ్లు మగతగా యెర్రగా వున్నాయి. కోల మొహం, ఎర్రటి పెదిమలు, నున్నగా మొనదేరిన గడ్డం క్రింద శంఖంలాంటి కంఠం శరీరానికి తగినట్టు ఒంపు సొంపులూ....

భూషణం ఆమెకేసి ఆవులించి చూశాడు.

సుశీల అతడిని విడూరంగా చూచి, "ఏమిటిది? వేళ గాని వేళ వచ్చావు?" అన్నది.

"నీతో వివరంగా మాట్లాడాలి."

"ఏ విషయం?"

"గుమ్మం అవతల నువ్వూ, ఇవతల నేనూ — ఇలా వుండే మాట్లాడాలా!"

"ఎప్పుడూ ఆడదాని మొహం చూడనట్టు చూస్తోంటే నాకు భయం వేస్తోంది. అంతే!" నవ్వింది సుశీల మత్తుగా.

"ఏం?" కొంటెగా అడిగాడు భూషణం.

"రాత్రి డాన్స్‌తో ఒళ్ళు నలిగిపోయి వుంది."

"ఇంక నీకు ఆ బాధ వుండదులే!"

సుశీల కళ్ళు విప్పుకు చూచి, ప్రక్కకి తప్పుకుంది. భూషణం గొంతులో ఆమె యెన్నడూ వినివుండని ఆత్మ విశ్వాసం ధ్వనించింది. భూషణం గదిలోకి నడిచాడు. సుశీల తలుపు దగ్గరగా వేసింది. భూషణం మంచంమీద కూర్చున్నాడు. సుశీల మంచం దగ్గరగా వచ్చి నిలబడింది. భూషణం ఆమె చెయ్యి పట్టుకోబోయాడు. సుశీల దూరంగా జరిగింది.

"సంగతి చెప్పు" అన్నది సుశీల.

భూషణం నవ్వి, "సంగతి చెప్పేవరకూ నిన్ను ముట్టుకో కూడదా?" అన్నాడు. సుశీల కొంటెగా నవ్వింది.

భూషణం బాగ్ తెరచి నోట్లకట్టలు తీసి మంచం మీద పోశాడు.

"రా. లెక్కపెట్టు" అన్నాడు.

"ఎక్కడివి? బాంకును దోచావా?" అడిగింది సుశీల.

"నేను దొంగలాగా వున్నానా?"

"..............."

"నీకోసం ఈ డబ్బు సంపాదించాను. నా పోల్ట్రీ ఫారం అమ్మేశాను."

"నాకోసమా? అదేమిటి? నేను అమ్మమని చెప్పానా?"

"నువ్వెందుకు చెబుతావు. నీ వయసు — సొగసు చెప్పాయి. అందుకే నా పోల్ట్రీని రామ్మూర్తికి అమ్మేశాను. మొత్తం పదివేలు యిచ్చాడు. నాతో వచ్చెయ్ మా యింటికి. అంటే మా స్వగ్రామం పోదాం."

"పోయి...."

"మన యిద్దరికీ పెళ్ళయినట్టు చెబుతాను. నువు మా యింటి కోడలివి కావడానికి ముసలితనంలో నా రాక కోసం తపిస్తోన్న నా తల్లిదండ్రులకు అభ్యంతరం వుండదు."

"ప్చ్.... నేను నీతో వచ్చేస్తానని యెలా అనుకున్నావ్?"

"ఏం?" ఆశ్చర్యంగా చూశాడు.

"నా శరీరంలో నాకంటూ ఏం మిగిలిందని!"

"అలా అనక! నాకు నువు కావాలి. అంతే!"

"నా వెనకవున్న చరిత్రతో!"

"నాకు తెలియదనా? నిన్ను నాతో సమానంగా గౌరవంగా చూసుకుంటాను. ప్లీజ్ — కాదనక!"

"నా పరిచయాలు అంత సులువుగా నన్ను వదులు

తాయా?"

"మాది మారుమూల కుగ్రామం. నీ పరిచయాలు గుర్తుంచుకుని అంతదూరం వస్తారని నాకు నమ్మకంలేదు."

"నిన్ను అనుమానిస్తోన్నట్టు భావించక. నువ్వయినా నన్ను ఎంతకాలం ఆదరిస్తావ్? నా ఒంట్లో సుఖం ఇవ్వ కలిగే వేడి వున్నంతవరకే కదా!"

"ప్లీజ్. అలా మాట్లాడక! నిన్ను జీవితాంతం ప్రాణంలా కాపాడుకుంటాను."

సుశీల కళ్ళు తడిగా మిల మిల మెరిశాయి. ఆమె కళ్ళలో కొత్త కాంతి! భవిష్యత్తుమీద ఆశ!

"డబ్బుతీసి బాగ్ లో పెట్టు" అంది సుశీల.

"ఒప్పుకున్నట్టే కదా!"

"అయితే చిన్న ఇబ్బంది. సుబ్బరామయ్యగారు ఒప్పుకోవాలి?"

"నువ్వు కేవలం డాన్సర్ వే కదా! అంతకంటె మీ పరిచయం ముందుకి వెళ్ళిందా?"

"లేదు. ఈ నెల జీతం అడ్వాన్సుగా తీసేశాను. వారం రోజులలో నెల అయిపోతుంది."

"ఆ వారానికి, లేకపోతే నువ్వు వాడుకున్న అడ్వాన్స్ మొత్తం చెల్లిస్తాను. నేను మాట్లాడతాను."

"వద్దు. వారం కంప్లీట్ చేస్తాను. ఆయనకీ మరో డాన్సర్ను చూసుకోవడానికి కాల వ్యవధి కావాలి కదా!"

"ఆల్ రైట్. నీ యిష్టానికి వ్యతిరేకంగా చెప్పను. ఈ డబ్బును జాగ్రత్తపెట్టు."

"డబ్బు మనదగ్గర దేనికి? ఖర్చులకు కొంత వుంచుకొని బాంక్ లో పడెయ్యవచ్చును గదా!"

భూషణం తలూపాడు. డబ్బును బాగ్‌లో సర్దాడు. గుమ్మందగ్గర అలికిడయింది.

"నేను కణ్ణన్‌ని" అన్నాడు కణ్ణన్ గది బయట నుంచి.

"లోపలికి రా కణ్ణన్!" అన్నాడు భూషణం.

తలుపులు తెరుచుకుని కణ్ణన్ గదిలో అడుగు పెట్టాడు.

"చికెన్ రెడీ అవుతోంది. హాలులో ఇప్పుడు సర్వీసింగ్ చేయడం బాగుండదు. గదిలోకి తీసుకురమ్మంటారా?" అడిగాడు కణ్ణన్.

భూషణం తలూపి. "ఒక జానీవాకర్ కూడా!" అన్నాడు.

కణ్ణన్ తలూపి, అక్కడే నిలబడిపోయాడు. భూషణం అర్థం చేసుకున్నట్టుగా తల పంకించి పాంటు జేబులో చెయ్యిపెట్టి అయిదు రూపాయిల నోటుతీసి, "వంటవాడికి యివ్వు" అన్నాడు.

కణ్ణన్ నోటు అందుకుని వినయంగా నవ్వి బయటకు వెళ్ళిపోయాడు.

సుశీల చటుక్కున తలుపు దగ్గరకు వేసివచ్చి భూషణాన్ని కౌగిలించుకుంది. భూషణం ఆమెను పొదివి పట్టుకుని. "త్వరగా తయారవ్వు. లంచ్ తెస్తాడు బేరర్." అన్నాడు.

సుశీల అతడిని విడిచిపెట్టి బట్టలపెట్టె కేసి నడిచింది. భూషణం ఆమెనే కళ్ళార్పకుండా చూడసాగాడు.

3

కణ్ణన్ బయటకి వచ్చినవాడు హాలులో వ్యక్తిని చూచి తెల్లబోయాడు. కుర్చీని కిందికి వాల్చుకుని త్యాగ

రాజు కోరగా చూస్తూ కూర్చున్నాడు. అతడి చూపులు కణ్ణన్ వైపు వున్నాయి.

'వీడు యెందుకు వచ్చినట్టు?' అని పరి పరి రకాలుగా మనసులో తర్జన భర్జన పడసాగాడు కణ్ణన్.

అతడి ఆలోచనలు పసిగట్టినట్టుగా త్యాగరాజు ఫెళ్లున నవ్వాడు. ఆ నవ్వుకి అర్థాలు లాగుకుంటే అర లక్ష వస్తాయని కణ్ణన్‌కి తెలుసు.

త్యాగరాజు పట్నంలో పేరుమోసిన రౌడీ. అతడికి చాల అర్థబలం వుంది. అర్థంవున్నచోట అంగబలమూ వుంటుంది. అది ప్రపంచంలో రివాజు. పోలీసు రికార్డు కెక్కగలిగీ, ఎక్కలేని అర్థబలం అది. అందుకే త్యాగరాజు అంటే వణుకుతారు ఎక్కువమంది. పట్టపగలు హత్యచేసి కాలర్ ఎత్తుకుని వెళ్ళగలిగే దమ్ము త్యాగరాజుకి ఒక్కడికే వున్నట్టు పట్నంలో వున్న రౌడీలకు తిరుగులేని నమ్మకం.

"ఇలా రా నాయనా! కణ్ణా!" పిల్చాడు త్యాగరాజు.

కణ్ణన్ తారెత్తిపోయాడు. త్యాగరాజు అంత సున్నితంగా పిల్చాడంటే ఆ వ్యక్తి జాతకం ముగిసిపోతుందని చాలమంది చెప్పుకోవడం విన్నాడు కణ్ణన్. అయినా వెళ్ళక తప్పదు అనుకుంటూ కణ్ణన్ ముందుకి నడిచాడు. త్యాగరాజు కూర్చున్న కుర్చీకి కొంత దూరంలో నిలబడ్డాడు.

త్యాగరాజు అతడిని చూసి మరల నవ్వాడు. డబ్బాలో రాళ్ళువేసి గిలకరించినట్లు అతడి నవ్వు వికారంగా వుంటుంది.

"గదిలో బొమ్మతో వున్నది భూషణమేనా?" అడి

గాడు త్యాగరాజు.

కణ్ణన్ అనుమానంగా చూసి తలాడించాడు.

"ఎందుకురా అలా వణికిపోతావ్ పిరికి సన్నాసీ! వాడిని పిల్చుకురా! నేను రమ్మన్నానని చెప్పు!" అని అంతలోనే ఫెళ్ళున నవ్వి, "వాడి శృంగారం వెలగ బెట్టాకే రమ్మను. తొందర లేదు" అన్నాడు.

"అలాగేనండి" అని కణ్ణన్ తిరిగివచ్చిన దారినే వెళ్ళి గది తలుపు తట్టాడు. తలుపులు తెరిచాడు భూషణం.

"మీ కోసం త్యాగరాజుగారు వచ్చారు సార్! మీ పనయిపోతే మాట్లాడడానికి రమ్మంటున్నారు." అన్నాడు కణ్ణన్.

"త్యాగరాజా! నా కోసమా!" ఆశ్చర్యంగా చూశాడు భూషణం. కణ్ణన్ నిర్లిప్తంగా చూశాడు.

"వస్తున్నట్టు చెప్పు" అని భూషణం కొంతసేపు ఆగి క్రిందకు వెళ్ళాడు.

"ఏమండోయ్! భూషణంగారూ! ఏమిటి విశేషం? బార్‌లో పట్టపగలు మకాం వేశారు" త్యాగరాజు కళ్ళెగ రేశాడు.

భూషణానికి ఆశ్చర్యం ఇంకా ఎక్కువయింది. తనని త్యాగరాజు చూడ రావడమే ఆశ్చర్యం అనుకుంటే, తనని అంత పరిచయంగా పిలవడం మరీ ఆశ్చర్యకరం!

అయినా భూషణం తన మనోభావాలు కనిపించ నివ్వటంలేదు.

"ఏం లేదు. చిన్న పనిపడి ఇటు వచ్చాను." అని మాత్రం అన్నాడు.

"పనేమిటో తెలుసుకోవచ్చునా?"

"నా వ్యక్తిగతం!"

"సరే! అడగను. పౌష్ట్రీఫారం అమ్మతోన్నట్టు మాట వరసకయినా నాకు కబురు పెట్టవద్దా?"

"కబురా? దేనికి?"

త్యాగరాజు చిరాకుగా చూశాడు.

"నాకు అమ్మడానికి!"

"అది అమ్మకం అయిపోయింది కదా!"

"తెలివిగా మాట్లాడుతున్నట్టు భ్రమపడక! అమ్మక ముందే నాకు కబురు పంపి వుంటే బాగుండేది."

"నా ఆస్తిని అమ్ముకోవడానికి మీకు కబురు పెట్టాలా?"

"నీ ఆస్తి? ఏ వూరు మనది?"

భూషణం అసహనంగా చూశాడు. మాట్లాడలేదు.

"ఏవూరు మనది? యెక్కడికి వచ్చాం? వచ్చిన నాలు గేళ్ళలో ఎంత ఆస్తి సంపాదించాం? సంపాదించిన ఆస్తిని అమ్ముకునేటప్పుడు ఆ ప్రాంతాల్లో వుండే పెద్ద మనుషు లకు చెప్పవద్దా? చెప్పండి భూషణంబాబుగారూ!" వెక్కిరించాడు త్యాగరాజు.

"పెద్దమనిషి ఎవరు?"

త్యాగరాజు ఒకసారి తన గుబురు మీసాలు దువ్వు కున్నాడు.

"నేను వుండగా మరొకడు పెద్దమనిషి నంటూ వస్తాడా?" అన్నాడు.

భూషణం హేళనగా చూశాడు.

"నిజమే! నువ్వుండగా మరొకడు పెద్దమనిషినని ఎలా వస్తాడు?"

"అంటే నీ వుద్దేశ్యం?"

"నీ గొప్ప నువ్వే చెప్పుకుంటున్నావు. అదే నే

నన్నాను. అంతే!"

"నేను నీ దృష్టిలో పెద్దమనిషిని కాదా!"

"నా దృష్టిలో నువ్వేమిటో నేను చెప్పనక్కర లేదు."

"ఏం?"

"నీ గొప్పతనం తెలియనివాడు పట్నంలో వుండడు."

త్యాగరాజు అనుమానంగా చూశాడు.

"నీ మాటల్లో హేళన లేదుకదా!"

"హేళనా? ఎందుకు? నా పొలాన్ని నేను అమ్ము కుంటే ఎందుకు అమ్మావని అడగవచ్చావు. నీలాంటి పెద్ద మనిషికి తెలియకుండా అమ్మినందుకు నెపం వేశావు. ఉంటేగింటే నీ మాటల్లోనే హేళన వుండాలి."

త్యాగరాజు కోపంగా చూచి, "నువు నన్ను అవమాన కరంగా చేసి మాట్లాడుతున్నావు. ఫలితం తెలుసా?" అన్నాడు.

భూషణం వెక్కిరింపుగా చూచి కుర్చీలాక్కుని కూర్చు న్నాడు.

"అబ్బే! తెలియదే!" అన్నాడు.

"భూషణం! నాకు కోపం వస్తే మనిషిని కాను. తెలుసా?"

"నీకు కోపం దేనికి రావాలి?"

"నీ పొలాన్ని నాకు అమ్మివుండవలసింది."

"అమ్మకం జరిగిపోయిన దాని గురించి వాదించడం వివేకమైన విషయం కాదనుకుంటాను. ఒప్పుకుంటావా?"

"అంటే నేను అవివేకినా?"

"ఏమో నీ విషయం నీకే బాగా తెలిసి వుండాలి."

"ఏమిట్రా నువ్వు వాగేది?" త్యాగరాజు కోపంగా

లేచాడు.

భూషణం నిర్లక్ష్యంగా చూశాడు. త్యాగరాజుకి అతడి ధోరణి మరింత కోపం తెప్పించింది. ముందుకు దూకి భూషణం ఫిలక పట్టుకున్నాడు. కుడిచేత్తో ముఖంమీద బలంగా కొట్టాడు.

అయితే భూషణం ముఖంమీద దెబ్బ తగిలేలోపుగా త్యాగరాజు బాధగా అరిచి పొట్ట పట్టుకున్నాడు. భూషణం శక్తికొద్దీ అతడి పొట్టలో గుద్దాడు.

త్యాగరాజు చేతిలోంచి ఫిలక విడుదల కాగానే భూషణం చటుక్కున లేచి, మోకాలెత్తి అతడి తొడల మీద గురిచూచి బలంగా పొడిచాడు.

త్యాగరాజు కెవ్వున అరచి చేతో పట్టుకుని నేలమీద కూలబడిపోయాడు. భూషణం అతడికి అవకాశం యివ్వ దల్చుకోలేదు. చెయ్యెత్తి బలంగా ముఖంమీద చరి చాడు. త్యాగరాజు పళ్ళు బిగబట్టి బాధను ఓర్చుకుంటు న్నాడు.

ఇంతకాలం తనచేతిలో తన్నులు తిన్నవారే కనిపిం చారు. కాని, ఇలా తన్నులు తినడంలో ఎలాంటి నరకం వుందో తెలియచెప్పిన వాళ్ళు లేరు.

త్యాగరాజు కళ్ళు చికిలించి చూశాడు. భూషణం వంటయింటికేసి చూస్తున్నాడు. వంటఇంటి గుమ్మంలో నిలబడిన వంటవాడూ, కణ్ణన్ గుడ్లప్పగించి చూస్తున్నారు. వాళ్ళ కంటికి త్యాగరాజుకంటె భూషణం భయంకరంగా కనిపిస్తున్నాడు.

భూషణం పరాకుగా వుండడం చూచి త్యాగరాజు కాళ్ళుచాచి అతడి మోకాళ్ళమీద తన్నాడు. భూషణం కట్టె విరిగినట్టు నేలమీద దబ్బున పడ్డాడు. త్యాగరాజు

నెమ్మదిగా లేచాడు.

భూషణం పడుతూనే త్యాగరాజు ఆలోచన కనిపెట్టాడు. తనమీదకు దూకుతోన్న త్యాగరాజును ఈడ్చి డొక్కలో తన్నాడు. త్యాగరాజు గింగరాలు తిరిగి కుర్చీ మీదపడి వెనక్కి దొర్లిపోయాడు. రక్తం కక్కుకున్నాడు.

భూషణం తాపీగా లేచి నెమ్మదిగా కండరాలను స్వాధీనంలోకి తెచ్చుకుని త్యాగరాజును సమీపించాడు. కాలర్ పట్టుకుని మొహం పైకెత్తాడు. త్యాగరాజు పరిస్థితి, పరిసరాలను గమనించేటట్టు లేదు.

భూషణం అతడిమీద కాండ్రించి వుమ్మి మెల్లగా వదిలిపెట్టాడు. నిశ్శబ్దంగా తన గదికేసి నడిచి వెళ్ళిపోయాడు.

4

గుమ్మందగ్గరే వున్న సుశీల భయంతో బిగుసుకుపోయి వుంది. ఆమె కళ్ళు మూసుకుని మెల్లగా వణుకుతోంది.

అకస్మాత్తుగా ఆమె భుజంమీద చేయి పడింది. ఆమె వులిక్కిపడింది. కళ్ళు తెరచి చూచింది. భూషణం ఆమె మొహంలోకి చూస్తూ కనిపించాడు. ఆమె తేరుకుని అతడిని వాటేసుకుంది.

భూషణం సుశీలను నడిపించుకుంటూ గదిలోపలికి వెళ్ళి తలుపు దగ్గరకు చేరవేశాడు. ఆమెను మంచంమీద కూర్చుండబెట్టి బాత్‌రూంలో చొరబడ్డాడు.

సుశీల మెల్లగా నిట్టూర్చి తలుపు తెరచి బయటకు చూచింది. కణ్ణన్ ట్రేతో వస్తూ కనిపించాడు. గదిలో సుశీలను చూశాడు. ఆమె మొహంలో ఎలాంటి భావమూ

లేదు. కణ్ణన్ నిర్లిప్తంగా గుమ్మంలో నిలబడి ఆమెకు ట్రే అందించాడు.

భూషణం బాత్‌రూంలోంచి బయటకు వచ్చాడు. ట్రేను చూచి తృప్తిగానవ్వి, "కణ్ణన్! సుబ్బరామయ్య రాగానే నాకు కబురు చెయ్యి" అన్నాడు.

కణ్ణన్ వెళ్ళిపోయాడు.

"సుబ్బరామయ్యతో చెబుతావా ఈ సంగతి?" అన్నది సుశీల.

భూషణం తలుపు గడియపెట్టి వచ్చి, "అవును. మన విషయమూ, ఆ రాస్కెల్‌గాడి విషయమూనూ" అన్నాడు.

సుశీల ట్రేమీద మూత తొలగించింది.

ఇద్దరూ భోజనానికి వుపక్రమించారు.

వాళ్ళు భోజనం ముగించేసరికి సుబ్బరామయ్య వచ్చాడని అతడి గొంతునుబట్టి భూషణానికి తెలిసింది. తలుపులు దగ్గరగా వేసుకోమని హెచ్చరించి, భూషణం బయటకు వెళ్ళాడు.

సుశీల తల వూపి అతడి వెనకే గడియపెట్టింది.

భూషణం వెళ్ళేసరికే వంటవాడూ, కణ్ణన్ కలసి జరిగిన సంగతి అంతా సుబ్బరామయ్యకి వివరించసాగారు.

"త్యాగరాజు ఎక్కడ?" అడిగాడు సుబ్బరామయ్య.

"మీరు వచ్చేముందే ఏదో ఆటో యిటువస్తే అది బేరం మాట్లాడి పంపించేశాం సార్!" అన్నాడు వంటవాడు.

భూషణానికి కుర్చీ చూపించి, "నువు కాస్త సహనంతో వ్యవహరించవలసింది. అతడితో అనవసరంగా కలహానికి దిగావు. మీరిద్దరూ బయట తన్నుకుంటే నాకు

అభ్యంతరం లేదు," అన్నాడు సుబ్బరామయ్య.

భూషణం శాంతంగా చూచి, "నా పరిస్థితిలో నువ్వున్నా నిన్నూ అలాగే రెచ్చగొట్టేవాడు. లేకపోతే అతడికి నాతో ఏం పని చెప్పు?" అన్నాడు.

"ఏమైనా నీ వరస నాకు నచ్చలేదు." అన్నాడు సుబ్బరామయ్య కటువుగా.

"విషయం పూర్తిగా వినకుండా నువ్వు నన్ను తప్పు పడితే నేను ఏం చేయాలి?"

"నీ విషయం విని నేను బావుకునేదేం వుంటుంది? నేను లేనప్పుడు నా ఇలాకాలో వున్న మనిషితో నువ్వు గదిలో గడపడంలో అర్థం లేదు."

"సారీ సుబ్బరామయ్యా! నీకు విషయం చెప్పాలనే అనుకున్నాను. ఇంతలో ఆ రాస్కెల్ గాడు అంతా రసాభాస చేశాడు. నేను సుశీలను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను."

సుబ్బరామయ్య తన చెవులను తనే నమ్మలేనట్టు చూశాడు.

"సుశీలను నువ్వు పెళ్ళి చేసుకుంటావా?"

"అవును."

"అదేమిటి? అంతకంటె మంచి ఆలోచన నీకు రాలేదా?"

"సుబ్బరామయ్యా! నా పరిస్థితులనుబట్టి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. స్నేహితుడిగా నువ్వు చేయగలిగిన మాట సహాయం చెయ్యి చాలు!"

వంటవాడూ, కణ్ణన్ మొహాలు చూసుకున్నారు.

"సుశీలను వదిలిపెట్టి నేను బార్ మూసుకోవాలి. స్నేహితుడిగా నేను చేయగలిగేది అంతే కదా!!"

20

"సుసీలతోనే బార్ వుందా? మరో అమ్మాయిని వెతుక్కోలేవా? ప్లీజ్. నాకోసం! నా పౌల్ట్రీ అమ్మి స్వగ్రామం వెళ్ళిపోయి సుశీలతో కొత్త జీవితం మొదలు పెడతాను."

"సుశీలలాగా సహకరించగలిగే అమ్మాయి నాకు దొరకవద్దా? దొరకడం అంత సులువనుకుంటున్నావా?"

"నేనూ ప్రయత్నిస్తాను. ప్లీజ్, కాదనక!"

"అమ్మాయిని దొరకనివ్వు. అయినా నీ ప్లాన్ గురించి నాకు ముందుగా చెప్పలేకపోయావా?"

"పౌల్ట్రీకి మంచి బేరం వచ్చింది. అమ్మకం సొమ్మే గాకుండా నాకు పదేళ్ళ కాలంవరకూ నెలకు రెండు వందలరూపాయిలు పంపిస్తానని రామ్మూర్తి ఒప్పందం పడ్డాడు"

"త్యాగరాజు అంతకు క్రితం నీ పౌల్ట్రీని కొనడానికి సిద్ధపడ్డాడట కదా. అతడినికూడా అమ్మేముందు సంప్రదించి వుండవలసింది."

"పదేళ్ళపాటు వాడు మాటకి కట్టుబడి వుంటాడన్న నమ్మకం ఏమిటి?"

"నిజమే! కోరి వాడితో తగవు పడ్డావు."

"ఏడిచాడు. చావుదెబ్బ తిని పారిపోయాడు."

"వారం రోజుల్లో ప్రయత్నించి నాకు మరో అమ్మాయిని ఏర్పాటుచేసి నువు వెళ్ళిపోవడం మంచిది. ఈ లోపులో అయినా నీ జాగ్రత్తలో నువ్వుండు."

భూషణం కృతజ్ఞతగా చూశాడు.

"నేను సుశీల గదిలోనే ఉంటాను. ఆమెను విడిచి పెట్టడానికి యెంత సొమ్ము యివ్వమంటావో నిర్మొహమాటంగా అడుగు" అన్నాడు భూషణం.

సుబ్బరామయ్య తలూపాడు.

భూషణం లేచి వెళ్ళిపోయాడు. మరో అర గంటలో బాగ్ తీసుకుని రోడ్డుమీద అడుగు పెట్టాడు. బాంకు ఉన్న ప్లాట్ కేసి చక చక నడవసాగాడు.

5

"క్రింగ్ .... క్రింగ్ .... క్రింగ్ ...."

రామ్మూర్తి చేతిలో ఉన్న మందు సీసాను టేబులు మీద పెట్టి టెలిఫోన్ వున్న బల్లకేసి నడిచాడు. రిసీవర్ ఎత్తి "హలో .... రామ్మూర్తి స్పీకింగ్ ...." అన్నాడు.

"రామ్మూర్తీ .... నేను త్యాగరాజును మాట్లాడుతున్నాను. నీకు పౌల్ట్రీ అమ్మిన భూషణం నామీద చెయ్యి చేసుకొన్నాడు. తెలిసిందా?"

"భూషణమా? నీమీదా? ఆశ్చర్యంగా వుంది."

"నేను ఆస్పత్రినుండి మాట్లాడుతున్నాను. నాకు తగల రాని చోట తగిలాయి దెబ్బలు. వాడు వూరు వదిలి వెళ్ళే లోపున పగ తీర్చుకుంటాను. నువు అనవసరంగా వాడి దగ్గరనుండి పౌల్ట్రీ కొన్నావు. వాడికి యెంత యిచ్చావో చెప్పు. నీకు డబ్బు చెల్లిస్తాను."

"నీకు అమ్మడానికా కొన్నది? మా యింట్లో ముగ్గురు గ్రాడ్యుయేటు కొడుకులున్నారు. వాళ్ళకి బతుకు తెరువు కోసం కొన్నాను. నాతో నీకు వాదం అనవసరం!"

"నా సంగతి తెలిసే మాట్లాడుతున్నావా?"

"ఎందుకు అందరినీ బెదిరిస్తావు? అయినా నీకు పౌల్ట్రీ ఏం చేసుకోను?"

"అక్కడినించి పౌల్ట్రీ నిమార్చి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ పెట్టించుతానని మా బావమరిదికి ఆశ పెట్టాను. లక్ష రూపాయలవరకూ లోన్ కూడా గ్రాంటయింది."

"నేను ఆ విషయంలో ఏం చేయలేను."

"ఆల్ రైట్! నేను ఆస్పత్రినుండి బయటకు రావాలి. మీ యిద్దరి పని చెప్పాలి."

"ముందు నువ్వు బయటికి రా. తర్వాత సంగతి చూసుకుందాం!" అని ఫోన్ పెట్టేశాడు రామ్మూర్తి.

ఫోన్‌లో మాట్లాడటం అయితే మాట్లాడాడు కాని అతడి మొహంలో ప్రేత కళ వచ్చింది. తన మాటలకి తనకే ఆశ్చర్యం కలుగుతోంది. ఏమిటిది? తను త్యాగరాజు లాంటి గూండాతోనా అలా మాట్లాడగలిగింది? ఏ ధైర్యంతో? తనకి అంగబలం ఏమున్నది-ముగ్గురు కొడుకులూ, ఇద్దరు పనివాళ్ళూ తప్ప!

6

టెలిఫోన్ గణగణ మ్రోగింది. బ్యాంకు యేజంటు రిసీవరెత్తాడు.

"హలో....గుడ్‌విల్ బ్యాంక్, హౌసింగ్ బోర్డు కాలనీ బ్రాంచ్ నుండి మాట్లాడుతున్నాను." అన్నాడు ఏజంట్.

"నమస్తే. మీ బ్యాంకులో భూషణానికి అక్కౌంటు వుంది. ఈ రోజు డబ్బు విత్ డ్రా చేశాడా?"

"మాట్లాడేది ఎవరూ?"

"భూషణం శ్రేయోభిలాషిని."

"ఆ విషయం మీకెందుకు?"

"చెప్పాను గదా అతడి శ్రేయస్సుకోరే అడిగాను."

ఏజంట్ ఫోన్ పెట్టేశాడు.

నిమిషం తర్వాత ఫోన్ మరల రింగయింది.

ఏజంటు ఫోన్ యెత్తాడు.

"ఈజిట్ గుడ్‌విల్ బ్రాంచ్?...." అడిగారు ఫోన్‌లో ఎవరో.

"ఎస్...."

"నేను భూషణాన్ని. ఈ రోజు డబ్బు విత్ డ్రా చేయాలనుకొంటున్నాను. కాష్ సిద్ధం చేయండి."

"మీరు భూషణం అని నమ్మకం ఏమిటి? బాంక్ కి వస్తే ఎటూ తీసుకుంటారు కదా!"

అవతల ఫోన్ పెట్టేశారు.

ఏజంట్ చిరాకుగా చూశాడు. ఈ కాలనీలో బిజినెస్ లేదు. వున్న పదిమంది ఖాతాదారుల్లో భూషణం ఒకడు. నిన్న సొమ్ము డిపాజిట్ చేశాడు అతడు. అదయినా యెంత? ముష్టి తొమ్మిదివేల చిల్లర.

భూషణం డబ్బు మీ బ్రాంచ్ లో యెంత వుంది?

అతడి అక్కౌంటులో నిన్న యెంత వేశాడు?

ఎప్పుడు డబ్బు విత్ డ్రా చేస్తాడు?

ఇప్పుడేమైనా విత్ డ్రా చేశాడా?

ఇవీ తనకి ఉదయంనుండీ వచ్చిన పది ఫోన్ కాల్సూనూ. భూషణం ఎక్కౌంటు గనుక మూసేస్తానంటే టౌన్ వెళ్ళి మెయిన్ బ్రాంచ్ నుంచి కాష్ తీసుకు రావాలి. కాస్త పెద్ద మొత్తంలో సొమ్ము కావాలంటే తను ఆ పద్ధతినే సురక్షితంగా ఉంటుందని యెన్నుకున్నాడు.

తలుపులు తెరుచుకొని కాషియర్ వచ్చాడు. అతడి చేతిలో విత్ డ్రాయల్ స్లిప్ ఉంది.

"భూషణానిదా?" అడిగాడు ఏజంట్

కాషియర్ ఆశ్చర్యంగా చూశాడు.

7

సుబ్బరామయ్య తలెత్తి చూశాడు. భూషణం వస్తూ కనిపించాడు.

భూషణం వెనక యెవరో కొత్త స్త్రీ నడుస్తూ

వస్తోంది. ఆమెను చూడగానే ఎగిరి గంతేసినంత పని చేశాడు సుబ్బరామయ్య.

మగవాళ్ళని పిచ్చెక్కించే హొయలు ఆమెలో సుశీల కంటె ఎక్కువ మోతాదులోనే వున్నాయి. సుశీలలో శాస్త్ర సంసార పక్షం ఆడతనం వుంది. ఈమెలో అది లేదు. లేకపోవడమే తనకి కావలసింది. అయితే ఈమె సుశీలలాగా వినయంగా మెలగుతూ పనిలో సర్దుబాటు చేసుకుంటుందో లేదో!

భూషణం సుబ్బరామయ్యను సమీపించాడు.

"ఈమె లత! సుశీల స్థానంలో చేరుతుంది." అన్నాడు భూషణం.

ఆమె సుబ్బరామయ్యకి నమస్కరించింది. నమస్కారంలోనే హొయలు చిలికినట్టు సుబ్బరామయ్యకు అనిపించింది.

"భూషణం నీకు షరతులు చెప్పాడనుకొంటాను."

ఆమె తలూపింది. భూషణం మెల్లగా దగ్గాడు.

"నేను ఈ రోజే సుశీలతో వెళ్ళిపోవాలనుకొంటున్నాను. ఆమె ఎక్కౌంటులో మీకు రావలసివున్నదెంతో చెప్పు సుబ్బరామయ్యా!" అడిగాడు భూషణం.

సుబ్బరామయ్య చకచక లెక్కలు వేసి "రెండువేల నాలుగువందలు!" అని కాగితంమీద వేసి యిచ్చాడు.

భూషణం ఆ కాగితాన్ని జేబులో పెట్టుకుని లతకేసి చూశాడు. "రా! సుశీలతో మాట్లాడుతూ కూర్చుందువుగాని" అన్నాడు.

లత తలాడించి అతడి వెనక బయలుదేరింది.

"రాత్రంతా ఏమయ్యావు?" అడిగింది సుశీల.

"తర్వాత చెబుతాను. ఇక్కడ ఎలా మెలగాలో

లతకి అన్నీ విషయాలూ చెప్పు. నేను బాంకులో డబ్బు ఇవ్వమని స్లిప్ యిచ్చి వచ్చాను." అన్నాడు భూషణం.

"మనం ఈరోజే బయలుదేర తామా?"

"అవును. మెయిల్ కి వెళ్ళిపోదాం. సర్దుకొని వున్నావు గదా?"

"నువ్వు బాంకుకి వెళ్ళిరా! మెయిలు ఒంటి గంటకి కదా!"

భూషణం గదిలోంచి బయటికి వచ్చేశాడు. రోడ్డు మీదకు అడుగుపెట్టాడు. బాంకువైపుగా నడవసాగాడు. రోడ్డుకి చివరగా ఎవరిదో కారు ఆగి ఉంది. నల్లకారు.

భూషణం తల దించుకొని బాంకులో ప్రవేశించాడు. పది నిమిషాల తర్వాత బరువుగా ఉన్న బాగ్ తో బయటికి వచ్చాడు.

ఏజంట్, భూషణాన్ని ప్రశ్నలువేసి విసిగించి విసిగించి వదిలాడు. ఏజంటును వదుల్చుకునేసరికి భూషణానికి తల దిమ్మెక్కిపోయింది.

నిర్జనంగా ఉన్న రోడ్డుకేసి ఒక్కసారి చూశాడు. నల్లకారు ముందుకి వస్తోంది. భూషణం ముందు నల్లకారు సడన్ బ్రేకుతో ఆగింది.

భూషణానికి ఏం జరుగుతుందో తెలిసేలోపులో కారు వెనక కిటికీ భూషణం ముందుకి వచ్చింది. భూషణం తలెత్తి కిటికీకేసి చూశాడు. కారు కిటికీలకు నల్లటి తెరలు కట్టివున్నాయి.

కిటికీలోంచి తెర తప్పించుకొని ఒక చెయ్యి వెలుపలికి రావడం, భూషణం చేతిలోంచి బేగ్ లాక్కోవడం, భూషణం అరవబోయేంతలో రెండో చేతిలో ఉన్న ఆయుధం అతడి మెడమీద విసురుగా పడటం అంతా

కన్ను మూసి తెరిచే లోపుగా జరిగిపోయింది.

మొదలు నరికిన చెట్టులాగా భూషణం క్రింద పడి పోయాడు. అతడి గొంతులోంచి రాబోయిన కేక గొంతు లోనే ఆగిపోయింది.

కారు ఒక్క దూకులో ముందుకి పరుగెత్తింది.

8

కాలింగ్ బెల్ అదే పనిగా మ్రోగుతోంది.

మైక్రోస్కోప్ క్రింద ఉన్న మెటీరియల్‌ను సర్దు కొంటున్నవాడల్లా లేచి తలుపువైపు నడిచాడు సారధి.

కీ హోల్‌లోంచి బయటికి చూశాడు. చీర కనిపిం చింది. చీర కట్టుకున్న వ్యక్తి తప్ప గుమ్మంలో ఎవరూ లేరు. సారధి తలుపు తెరిచాడు. ఆమెకేసి ప్రశ్నార్థ కంగా చూశాడు.

"డిటెక్టివ్ శిరీష్‌గారు మీరేనా?" అడిగిందామె.

"కాదు. వారితో మాట్లాడాలా?" అడిగాడు సారధి.

ఆమె అవునన్నట్టు తలూపింది.

"లోపలికి రండి" అని దారి ఇచ్చాడు సారధి. ఆమె లోపలికి అడుగు పెట్టింది. సారధి డ్రాయింగ్ రూంలోకి నడిచాడు. ఆమెకు సోఫా చూపించి, "కూర్చోండి. మీ పేరు?" అన్నాడు సారధి.

"నా పేరు సుశీల. నాకు కాబోయే భర్తను ఎవరో హత్య చేశారు." ఆమె మొహాన్ని చేతులతో కప్పుకొని యేడుస్తోంది.

సారధి ఆమెకేసి పరీక్షగా చూశాడు. ఆమెను ఎక్కడో చూచినట్టుంది.

"ఆలోచనలకు సమయం కాదు" అనుకొంటూ లోప లికి వెళ్ళాడు.

అప్పుడే డిటెక్టివ్ శిరీష్ రిసీవర్ క్రెడిల్ చేస్తూ కని పించాడు.

"మీ కోసం సుశీల అనే ఆవిడ వచ్చింది. ఏదో హత్య కేసు విషయమై మాట్లాడాలట!"

"భూషణం హత్యకేసా!" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"అడగలేదు. డ్రాయింగ్ రూంలో కూర్చుండ బెట్టాను."

"నువు తయారవు. హెచ్. బి. కాలనీకి వెళ్ళాలి." అంటూ డిటెక్టివ్ శిరీష్ అతడి సమాధానంకోసం ఎదురు చూడకుండా డ్రాయింగ్ రూంకేసి నడిచాడు.

సుశీల శిరీష్‌ను చూడగానే ఏడుపు ఆపింది.

"విషయం క్లుప్తంగా చెప్పమ్మా! మేము బయటికి వెళ్తున్నాం," అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

సుశీల క్లుప్తంగా తనకీ భూషణానికీ ఉన్న పరిచయం గురించి చెప్పింది.

"శిరీష్‌గారూ! మేము త్వరలో పెళ్ళి చేసుకోవాలను కున్నాం. ఆయన బాంకుకి వెళ్ళి డబ్బు విత్‌డ్రా చేసి తిరిగి వస్తున్నారట. ఎవరో ఆయనని మెడనరికి నా బతు కుల్లో నిప్పులు పోశారు. ఇంకా శవం అక్కడే రోడ్డు మీద దిక్కు లేకుండా పడివుంది. శవాన్ని చూడటం నాకు కడుపులో దేవుతోంది. నాకు తగిన పద్ధతిలో మీరు సహాయం చేయగలరని నాకు సుబ్బరామయ్య చెప్పాడు," అంది సుశీల.

"రండి. మేమూ కాలనీకి వెళ్తున్నాం. క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నన్ను రమ్మని ఫోన్ చేశారు."

సుశీల లేచింది.

పోర్టికోలో హారన్ ప్రోగింది.

"పదండి. మా సారధ కారు సిద్ధం చేశాడు." అంటూ శిరీష్ హుందాగా అడుగులు వేసుకొంటూ బయటకు నడిచాడు. సుశీల బయటకి రాగానే తలుపులు తాళం వేశాడు.

ఇద్దరూ పోర్టికోలో వున్న కారు వద్దకు నడిచారు. సుశీలకి వెనక సీటు చూపించి, డిటెక్టివ్ శిరీష్ సారధి ప్రక్క కూర్చున్నాడు.

డాట్సన్ ముందుకి ఉరికింది. తారురోడ్డును మింగుతూ జరజర సాగే పాములాగా డాట్సను నేషనల్ హైవే లోకి మళ్లింది. గాంధీనగర్ వద్ద మలుపు తిరిగి సీతమ్మ ధారలో అడుగుపెట్టింది. కొండవారగా వేసిన రోడ్డు లోకి తిరిగింది. హెచ్. బి. కాలనీలోకి మళ్ళింది.

రాత్రిళ్ళు బార్ ముందు తప్ప అంత జనం గుమిగూడి రోడ్డుమీద చేరడం కారులో ఉన్న ముగ్గురిలో యెవరూ చూడలేదు. పోలీసులు ఆ గుంపును అదుపులో పెట్టడానికి లాఠీలు గాల్లో ఝూడిస్తున్నారు.

డాట్సన్‌ని గుంపుకి కాస్త దూరంలో ఆపి సారధి డోర్ తెరచుకొని దిగాడు. వెనకడోర్ తెరచి పట్టుకొన్నాడు. సుశీల దిగింది.

డిటెక్టివ్ శిరీష్ కారు దిగి హుందాగా అడుగులు వేసుకొంటూ గుంపులో చొరబడ్డాడు. గుంపుకి అవతల ప్రక్క రెండు జీపులూ, ఒక వేనూ ఆగి ఉన్నాయి.

క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ శిరీష్‌ను చూచి "రా! నీ కోసం ఎదురు చూస్తున్నాము" అన్నాడు.

రోడ్డుమీద రక్తం మడుగు చింతపిక్క రంగులో పెచ్చుకట్టి ఉంది. దానిమధ్య శవం వున్నట్టుంది. శవం

మీద దుప్పటి కప్పి ఉంచారు.

"శవాన్ని చూస్తావా?" అడిగాడు గోపాల్.

శిరీష్ సమాధానంగా తలూపి, వొంగి మొహంమీద ఉన్న గుడ్డను తప్పించి చూశాడు. మెడ మూడు వంతులు తెగిపోయి ఒక ప్రక్కగా వ్రేలాడుతోందా అన్నట్టు పొజిషన్‌లో మార్పు ఉంది. హతుడి మొహంలో తీవ్రమైన బాధ ఇంకా వ్యక్తమవుతోన్నట్టు మొహంలో కండరాలు ముడుచుకుని వున్నాయి.

"ఏదో పదునుపాటి ఆయుధంతో ఒకే వ్రేటుతో ఇంత గాయం చేయగలిగాడు హంతకుడు. వెంటనే ప్రాణం పోయివుండాలి. అందుకే నేలమీద పడ్డవాడు పడ్డట్టు ఉండిపోయాడు" అన్నాడు డిటెక్టివ్ శిరీష్, దుప్పటి మూసి.

"అవును. డాక్టర్ కూడా అలాగే అభిప్రాయపడ్డాడు" అన్నాడు గోపాల్.

"హత్య జరిగేటప్పుడు ఎవరైనా చూచి ఉంటారు. అసలు మీకు ఫోన్ చేసిందెవరు?" అడిగాడు శిరీష్.

"గుడ్‌విల్ బాంక్ ఏజంట్."

"ఆయన యింకా యేం చెప్పారో చెప్పు!"

"బాంకులో కూర్చుండే మాట్లాడుకొందాం. శవాన్ని మార్చ్యురీకి పంపడం ఒక్కటే మిగిలింది" అంటూ గోపాల్ తన సిబ్బందికి ఆదేశాలిచ్చాడు.

పోలీసులు రోడ్డుమీద కొంత మేరకు రాళ్ళు వుంచి ఆ వలయంలోకి యెవరూ జొరబడకుండా అదుపు చేస్తున్నారు.

శిరీష్, గోపాల్ బాంక్‌లో అడుగుపెట్టారు. వాళ్ళిద్దరి వెనుకగా సారథీ, సుశీలా లోపలకి వెళ్ళారు. బాంక్

మేనేజర్ వాళ్ళను సాదరంగా ఆహ్వానించి ఆసనాలు చూపించాడు.

"నా కళ్ళముందు ఇంత దారుణం జరుగుతుందనుకో లేదు. భూషణం డబ్బు తీసుకొని రోడ్డుమీద అడుగు పెట్టాడు. నా గది కిటికీలోంచి అతడిని పరిశీలించ సాగాను...."

"మీ మాటకి అడ్డు వచ్చాను ఏజంటుగారూ! భూష ణాన్ని మీరు ప్రత్యేకంగా పరిశీలించడానికి కారణం యేమైనా వుందా? కేవలం కాకతాళీయంగానా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"మంచి ప్రశ్న వేశారు" అని ఏజంటు తనకి ఉదయం నుండీ వస్తోన్న ఫోన్ కాల్స్ గురించి వివరంగా చెప్పాడు....

"అఫ్టరాల్ తొమ్మిదివేల రూపాయలకోసం అంత మంది వ్యక్తులు భూషణంమీద నిఘా ఉంచారంటే చాలా విచిత్రంగా వుంది. డబ్బు చెల్లినా మీరు భూషణాన్ని హెచ్చరించి ఉంటే బాగుండేదేమో!" అన్నాడు గోపాల్.

"యూ ఆర్ కరెక్ట్! నేను ఆ పని చేశాను. అతడు మరో గంటలో పట్నం వదలి దూరంగా వెళ్ళిపోతాడని తెలిసి ప్రమాదం లేదని ఆశించాను."

"భూషణం రోడ్డు మీద వెళ్తోంటే....తర్వాత యేమైందని?"

"నల్లటి అంబాసిడర్ కారు భూషణాన్ని సమీపిం చింది. భూషణానికీ నాకూ మధ్య కారు అడ్డం వుంది. కారు సడన్ బ్రేక్‌తో ఆగింది. ఏం జరిగిందో తెలిసేలోపుగా కారు వేగంగా వెళ్ళిపోయింది. భూషణం కింద పడి

పోయాడు. మెడ ప్రాంతం నుండి తూములోంచి వర్షపు నీరు వస్తున్నట్టు రక్తం గోడమీదకు పారుతోంది. నేను కళ్ళు తిరిగి కిటికీదగ్గరే పడిపోయాను. కాషియర్ ఎందుకో లోపలికి వచ్చి నన్ను చూచి మొహాన నీళ్ళు చల్లాడు. పోలీస్ స్టేషన్ కి రింగ్ చేశాను" చెమటలు పట్టిన మొహం తుడుచుకొన్నాడు ఏజంటు.

"కారు నెంబర్ చూశారా?"

"లేదు—కాని ఆ కారు 69వ సంవత్సరం మోడల్."

"కారులోంచి యెవరైనా కనిపించారా?"

"చెప్పడం మరచాను. కారుకు చుట్టూ నల్లటి తెరలున్నాయి."

శిరీష్ సాభిప్రాయంగా గోపాల్ కేసి చూశాడు. గోపాల్ తలూపి లేచాడు.

"థాంక్యూ! చాల విలువైన సమాచారం యిచ్చారు. పని పడితే మరల మిమ్మల్ని కలుస్తాను" అన్నాడు గోపాల్ చెయ్యి చాపి.

ఏజంటు కరచాలనం చేశాడు.

నలుగురూ బయటకు వచ్చారు.

గోపాల్ సుశీలకేసి చూచి, "ఈమె యెవరు?" అన్నాడు.

శిరీష్, గోపాల్ కి సుశీలను పరిచయంచేసి ఆమె గురించి చెప్పాడు. గోపాల్ నుదురు చిట్లించాడు.

9

"భూషణం మీద మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు గోపాల్.

సుబ్బరామయ్య వినయంగా చూశాడు.

"భూషణం నాకు నాలుగు సంవత్సరాలుగా తెలుసు.

కష్టపడి పైకి వచ్చినవాడు. పది కోళ్ళతో మొదలుపెట్టిన కోళ్ళ ఫారం యీ రోజు పదివేల రూపాయలకు అమ్మ గలిగాడంటే అతడి కృషి అర్థమౌతోంది. అయితే అతడిది మొండిపట్టు."

"సుశీలను అతడు పెళ్ళి చేసుకుంటానంటే మీరు ఆశ్చర్యపోలేదా?"

"నిజమే! అప్పుడప్పుడూ సుశీలతో గడిపేవాడు. పెళ్ళి చేసుకొంటానంటే నా చెవులను నేనే నమ్మలేక పోయాను. నాకు సుశీలవంటి డాన్సర్‌ను వదులుకోవడం కష్టంగా అనిపించింది.అయితే లత అనే కొత్త డాన్సర్‌ను వెతికి తీసుకువచ్చాడు భూషణం."

గోపాల్ అనుమానంగా చూచి, "భూషణం హత్య గురించి మీరేం చెబుతారు?" అన్నాడు.

శరీఫ్, సారథిని సైగచేసి పిలిచి అతడి చెవిలో యేదో చెప్పి బయటకు పంపేశాడు. సుబ్బరామయ్య తనలో తాను తర్జనభర్జన పడుతోన్నట్టు అతడి ముఖకవళికలు చెబుతున్నాయి.

"చెప్పండి. ఫరవాలేదు. మీ ప్రాణరక్షణ బాధ్యత మేము తీసుకుంటాం."

"నిన్న త్యాగరాజుతో తగాదాపడ్డాడు...."

గోపాల్ పాయింట్ నోట్ చేసుకొని, "త్యాగ రాజు అంటే సంతపేట రౌడీయేనా? ఇద్దరికీ గొడవ యేమిటి?" అన్నాడు.

"నా కంటె కణ్ణన్ మీకు బాగా చెబుతాడు" అని సుబ్బరామయ్య లోపలికి వెళ్ళాడు.

సారథి లోపలికి వచ్చాడు. శరీఫ్ చేతికి కాయితం యిచ్చాడు. ఆ కాగితంలో యేవో అంకెలూ, కారు రైల్ల

డిజైనూ వున్నాయి. సుబ్బరామయ్య కణ్ణన్‌ని వెంటపెట్టు కొని వచ్చాడు.

కణ్ణన్ త్యాగరాజుకీ భూషణానికీ జరిగిన ఘర్షణ కళ్ళకి కట్టినట్టుగా వర్ణించాడు.

"వాళ్ళిద్దరూ ఘర్షణపడటం యింకా యెవరెవరు చూశారు?"

"సుశీల 'తనగది గుమ్మంలో నిలబడి వుంది. నేనూ వంట వాడూ వంటయింటి గుమ్మంలో వుండి చూశాము...."

"మీలో యెవ్వరూ కలగజేసుకోలేదా?"

"ఎటు మాట్లాడినా త్యాగరాజుతో తంటా తెచ్చు కొన్నట్టే సార్! కష్టమర్స్ గొడవలు మాకేల?" అన్నాడు కణ్ణన్.

"త్యాగరాజు మరల ఇక్కడికి వచ్చాడా?"

"తెలీదు సార్!"

"అతడు గాయాలతో నర్సింగ్ హోంలో చేరినట్టు భూషణం నాతో అన్నాడు" మధ్యలో కలగజేసుకుని అన్నాడు సుబ్బరామయ్య.

"ఏ నర్సింగ్ హోంలోనో తెలుసా?"

"రామభద్రంగారిది. ఫెయిర్ లేడీ జంక్షన్‌లో ఉందట!"

"భూషణం పోట్రిఫారం అమ్మాడు. ఆ అడ్రసు చెబుతారా?"

సుబ్బరామయ్య చెప్పాడు. గోపాల్ రాసు కొన్నాడు....

"ఇంత మారుమూల బార్ పెట్టడంవలన ఏమిటి లాభం వస్తుంది చెబుతారా?" అడిగాడు శిరీష్.

"నాకు పెద్దగా లాభాలు ప్రస్తుతంలో రావు—ఆ విషయం తెలుసు సార్! అయితే భవిష్యత్తులో యింత చోటు కూడా ఈ పట్నంలో దొరికేలా లేదు. అందుకని ముందే ప్లాట్ తీసుకున్నాను. అయినా యిప్పుడు నా ఖర్చులు బాగానే పోతున్నాయి" చెప్పాడు సుబ్బరామయ్య.

10

"శవంమీద గానీ, దుస్తులమీదగానీ ఇతరుల వ్రేలి ముద్రలు లేవు" అని చేతిలో వున్న రిపోర్టును బల్లమీద ఉంచాడు గోపాల్.

"వ్రేలిముద్రలు పడే అవకాశం లేదు. భూషణం దగ్గర ఉన్న బాగ్ లాక్కోవడం వెంటనే కత్తితో గాయపరచడం చేశాడు హంతకుడు. భూషణం వెనక డోర్ దగ్గర నిలబడ్డాడట. అంటే కారులో హంతకుడూ ఉన్నాడన్నమాట. ఏమైనా యిది ముందు పథకం వేసుకుని చేసిన హత్య!"

"అవును శిరీష్! భూషణం తన సొమ్మును విత్ డ్రా చేసుకొనేవరకూ వేచివున్నాడు హంతకుడు. పట్టపగలే రోడ్డుమీద హత్యచేసి పారిపోయాడు. నల్ల అంబాసిడర్ కోసం ప్రయత్నం చేయమని మా సిబ్బందికి ఆదేశాలిచ్చాను."

"ఫలితం వుంటుందనుకోను. రెండువందల రూపాయలతో నలుపురంగు మరో రంగుగా మారిపోతుంది."

సార్జెంట్ లోపలికి ప్రవేశించి శల్యూట్ చేసి సీల్ చేసిన కవరు గోపాల్ కి యిచ్చాడు. గోపాల్ అతడిని వెళ్ళిపొమ్మని సైగచేసి, కవరు తెరిచాడు.

"డాక్టర్ రిపోర్ట్! చదువుతా విను" అని గోపాల్

పైకి చదవసాగాడు.

"హత్య ఉదయం పదిగంటల ముప్పై—నలభై నిమిషాల మధ్య జరిగింది. పదునైన కత్తితో గాయపరచడంతో శ్వాసనాళం మొత్తం తెగిపోయింది. వెనుక వెన్నెముక పట్టు తప్ప తల మొండెంతో సంబంధం లేకుండా పోయింది. గాయం తగిలిన క్షణాల్లో ప్రాణం పోయి ఉంటుంది" చదవడం ఆపి, "ఆ తర్వాత గాయం లోతు, కొలతలు రాసి వున్నాయి. బ్లడ్ గ్రూప్ 'ఎ బి' అట" అన్నాడు గోపాల్.

శిరీష్ ముందుకి వొంగి, "కత్తి ఎలాంటిదో రాశారా?" అడిగాడు.

"రాశారు. పొడవుపాటి కత్తి అయివుండాలట! అందుకే గాయం మెడకి ఆ ప్రక్కనించి ఈ ప్రక్క వరకూ ఒకే లెవెల్‌లో సంభవించిందని రాశారు డాక్టర్."

"కత్తి మనకి దొరకదు. హంతకుడు కారులో పట్టుకునే పారిపోయాడు."

"సారధి నోట్ చేసిన కొలతలు యేవి? వాటనిబట్టి మనం కారు ఆచూకీ తీయగలమా?"

శిరీష్ తనకి సారధి యిచ్చిన కాగితం తీసి గోపాల్‌కి యిచ్చాడు "చక్రాల మధ్య కొలతలు నోట్ చేశాడు సారధి. సడెన్ బ్రేక్ వేయడంతో అంబాసిడర్ టైర్ల గుర్తులు స్పష్టంగా రోడ్డుమీద ముద్రపడ్డాయి. వెనుకనున్న చక్రాల టైర్లలో ఎడమ టైర్‌కి పెద్దసైజు నారింజతొన మాదిరిగా పెచ్చు వూడిపోయింది. ఆ ప్రాంతం తప్ప టైరు ముద్ర స్పష్టంగా ముద్ర పడి ఉంది...." అన్నాడు.

"వెనక టైర్ అని యెలా చెప్పగలవు?"

"ముందు చక్రం టైర్ అయివుంటే రన్నింగ్‌లో దాని మీదకు వెనక చక్రం వచ్చేది. ముద్ర కొంతవరకైనా చెరిగిపోయి ఉండేది కదా."

"యూ ఆర్ కరెక్ట్!"

"నర్సింగ్ హోంలో త్యాగరాజును కలుసుకుందాం— పద!" ఇద్దరూ జీప్ యెక్కి బయలుదేరారు.

నర్సింగ్ హోంలో త్యాగరాజుకి యింజక్షన్ చేస్తూ కనిపించాడు డాక్టర్. గోపాల్, శిరీష్ గదిలో అడుగు పెట్టి త్యాగరాజు పడుకున్న బెడ్‌ను సమీపించారు. ఇద్దరినీ చూడగానే త్యాగరాజు ఆశ్చర్యపోయాడు.

"ఎలా వుంది నీ ఒంట్లో?" అడిగాడు గోపాల్.

త్యాగరాజు బాధగా అటునుండి ఇటు తిరిగి "ఫరవా లేదు. డాక్టర్‌గారు మాత్రం రెండు రోజులవరకూ కదల వద్దని చెప్పారు" అన్నాడు.

"నిన్ను భూషణం అంత గట్టిగా కొట్టాడా? ఆశ్చర్యం! సంతపేట రౌడీ నని ప్రగల్భాలు పలుకు తావు."

త్యాగరాజు మొహం ఎర్రబడింది.

"చట్టం అడ్డుపడినా సరే, నేను వాడిని దెబ్బతీయనిదే వదలను."

"అతడిమీద నీకు కక్ష అనవసరం!"

"మీకు తెలియదు సార్! అతడు కావాలనే పొల్ట్రీని నాకు అమ్మకుండా రామ్మూర్తికి అమ్మాడు."

"అందుకే భూషణాన్ని చంపించావా?" గోపాల్ సూటిగా చూచి అడిగాడు.

త్యాగరాజు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి

చూశాడు.

"చంపించడమా....? భూషణాన్ని యెవరైనా చంపారా?"

"ఆశ్చర్యం నటించక! నిన్ను యింత గట్టిగా దెబ్బ తీసిన వాడిని నువ్వు అంత సులువుగా వదులుతావనుకోను. నిజం చెప్పు."

"నేను రౌడీనే. కాదనను. వాడిని దెబ్బతీస్తే నేనే దెబ్బ తీస్తాను. నా క్రిందవాడి సహాయంకోసం యెదురు చూడను. ఆ రోజు బార్ కి వెళ్ళినప్పుడు కూడా నేను ఒక్కడినే వెళ్ళాను. వాడిమీద మనిషిని నియోగించ వలసిన అవసరం నాకు లేదు."

"త్యాగరాజూ! అనుమానితులలో మొదటివాడివి నువ్వు. నీ మీద నిఘా ఉంటుందనే విషయం నీకు విడిగా చెప్పనక్కరలేదనుకుంటాను. నువ్వుగానీ, నీ అనుచరులు గానీ తప్పులు చేసివుంటే నా గుప్పిట్లోంచి బయటికి పోరు. అర్థం చేసుకో. పట్నం వదలిపెట్టి వెళ్ళక! అది క్షేమం కాదు."

గోపాల్ తీవ్రస్వరంతో హెచ్చరించాడు.

త్యాగరాజు నిర్లక్ష్యంగా తలెగరేశాడు.

11

"మీరేనా డిటెక్టివ్ శిరీష్! పేపర్లో ఫోటో చూశాను. చాలా కాలం అయివుంటుంది. మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషం. చెప్పండి. మీకు నేనెలా సహాకరించగలను?" అన్నాడు రామ్మూర్తి.

సమాధానంగా శిరీష్ నవ్వి రామ్మూర్తితో కరచాలనం చేశాడు. "భూషణం హత్య చేయబడ్డట్టు మీకు తెలిసివుండాలి. హంతకుడిని పట్టుకునే ప్రయత్నంలో

ఉన్నాను."

"కేవలం మీ ఆసక్తితోనా?"

"కాదు."

"మరి? అతడికి బంధువులెవరూ లేరు. పరిశోధన చేయమని మిమ్మల్ని యెవరు కోరారో ఆశ్చర్యంగా ఉంది."

"సుశీల కోరింది."

"సుశీలా! చాలా ఆశ్చర్యంగా ఉంది. కొంతమంది సంసార స్త్రీల కంటే సుశీల చాలా నయం అన్న మాట!"

శిరీష్ తల పంకించి, "పాల్ట్రీని మీకు అమ్మకముందు దీన్ని త్యాగరాజు కొనాలనుకున్నాడట! ఆ విషయం మీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు. అయితే మార్కెట్లో వున్న వస్తువును కొనుక్కోవడానికి ఒకరి యిష్టాయిష్టాలు అనవసరం. మీరూ ఒప్పుకుంటారనుకుంటాను."

"ఎందుకు ఒప్పుకోను? అయితే ఈ మాత్రం పౌల్ట్రీ ఫారంకోసం త్యాగరాజూ మీరు పోటీలు పడటంలో అర్థం లేదు."

"నాకు తెలిసి పదేళ్ళలో పట్నం రూపురేఖలు మారిపోయాయి. అన్నిప్రక్కలా కొండలను తాకి ఇంకా పైకి ప్రాకుతోంది. కొండ అవతల వున్న లోయలూ, చిట్టడవులూ భవంతులతో కళకళ లాడుతున్నాయి. కొంత కాలానికి పౌల్ట్రీ వున్న స్థలమే రాదు. నేను పెట్టిన పది వేల రూపాయలకి!"

అంతలో గుమ్మంలో చారల చొక్కా, నల్ల పాంటూ వేసుకున్న యువకుడు కనిపించాడు. రామ్మూర్తి అతడి

వైపు కోపంగా చూచి అంతలోనే ముఖకవళికలు మార్చుకున్నాడు.

"ఒక గంట పోయాక రా బాబూ! ఉద్యోగం విషయం మాట్లాడదాం!" అన్నాడు రామ్మూర్తి ఆ యువకుడితో.

యువకుడు నిర్లిప్తంగా బయటకు వెళ్ళిపోయాడు.

"మీరు జరిగిన సంగతి చెప్పండి." అన్నాడు శిరీష్.

రామ్మూర్తి తెల్లబోయాడు. "జరిగిన సంగతేమిటి?" అన్నాడు.

శిరీష్ లేచాడు. రామ్మూర్తి కొంతవరకూ ఏవో సంగతులు దాస్తున్నాడు. ఇప్పట్లో చెప్పడు. పరిస్థితులు మరింతగా దాడి చేయాలి. అంతవరకూ పెదిమ విప్పడు.

రామ్మూర్తి దగ్గర సెలవు తీసుకొని శిరీష్ వెళ్ళి పోయాడు.

12

"సుశీలా! సుశీలా!" పిల్చాడు కణ్ణన్.

సుశీల తలుపు తెరిచి చూచింది.

"నీ కోసం ఫోన్ వచ్చింది." అన్నాడు కణ్ణన్.

సుశీల నవ్వుకొంది. కణ్ణన్ మళయాళ దేశంనుంచి వచ్చాడు. ఎంత బాగా నేర్చుకున్నప్పటికీ పరాయి భాష పరాయిభాషే!

"ఎవరు ఫోన్ చేశారో అడిగావా?"

"లేదు. మగవాళ్ళే, యెవరో!"

సుశీల గది తలుపులను దగ్గరగా వేసి ఫోన్ ఉన్న గది కేసి నడిచింది.

"నేను.... సుశీలను మాట్లాడుతున్నాను." అన్నది రిసీవరెత్తి.

"సుశీలా! నేను చెప్పేది జాగ్రత్తగా విను."

సుశీల కొయ్యబారిపోయింది. ఈ గొంతు యెవరిది? తనకి పరిచయంలేని గొంతు.

"ఎవరు మీరు?" అడిగింది.

"నేను యెవరినయినా నీకు ఒక్కటే - శ్రేయస్సు కోరితే చాలు గదా!"

"................"

"నీకు భూషణం యెటూ ఇక లేడు గదా! నాతో లేచి వచ్చెయ్యి. సుబ్బరామయ్యని బతిమాలి స్వేచ్ఛ పొంది నాతో వచ్చెయ్యి."

"ఎవరు నువ్వు" సుశీల అసహనంగా అరిచింది.

"భూషణంకంటె వయసులో చిన్నవాడిని. పైగా అందగాడిని!" పకపక నవ్వాడు.

"ఛీ....నీకు బుద్ధి వుందా?"

"కంగారులేదు. ఆలోచించుకో! మనం దూర తీరాలకు ఎగిరిపోదాం. తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు ఫోన్ చేస్తాను. ఫోన్ దగ్గరే కాచుకుని ఉండు." అవతలనించి ఫోన్ పెట్టేసిన శబ్దమయింది.

సుశీల చిరాకుగా రిసీవర్‌ని క్రెడిల్ చేసి, చుట్టూ చూసింది. అదృష్టం! ఎవరూ లేరు. తమ మాటలు యెవరూ వినలేదు. నీరసంగా తన గదికేసి నడిచింది.

13

ఇన్‌స్పెక్టర్ గోపాల్ టోపీ తీసి బల్లమీద పెట్టి, నీరసంగా కళ్ళు మూసుకొని కుర్చీలో కూలబడ్డాడు. డిటెక్టివ్ శిరీష్ పరిస్థితి ఇంచుమించు అలాగే వుంది.

"నువ్వన్నట్టు అంబాసిడర్ కార్ల వ్యవహారం ఇంత వరకూ లాగాం కానీ కేసు ఒక అంగుళం కూడా ముందుకి

వెళ్ళలేదు." అన్నాడు గోపాల్.

"హంతకుడు ఉపయోగించిన కారు ఒరిజినల్ నల్ల రంగుదే అయివుంటే ఇంతవరకూ మనం వెతికిన నల్ల అంబాసిడర్లలో ఏదో ఒకటి అయి వుండేది. ఒరిజినల్ రంగు మరేదో అయి ఉండాలి."

శిరీష్ మాట ముగిసే లోపుగా టెలిఫోన్ గణ గణ లాడింది.

గోపాల్ చెయ్యి చాపి బల్లమీద ఉన్న ఫోన్ అందుకొని, "హలో—ఇన్‌స్పెక్టర్ గోపాల్ స్పీకింగ్...." అన్నాడు.

అవతల మాట్లాడేవారి మాటలు విని అటెన్షన్‌లోకి వచ్చాడు.

"ఎస్ సార్.... నేను సార్.... నా ప్రయత్నంలో లోపం లేదు సార్! ఎస్ సార్....కొత్తగా డెవలప్ అవుతోన్న కాలనీలో ఇలాంటి సంఘటన జరగకూడదు సార్! హంతకుడిని త్వరలో పట్టుకుంటాం సార్!"

అవతల ఫోన్ క్లిక్‌మన్నది. గోపాల్ కోపంగా రిసీవర్ కేసి చూచి, క్రెడిల్ చేశాడు.

"మీ కమీషనర్ బాగా అక్షింతలు వేశాడా?" అడిగాడు శిరీష్.

"వాళ్ళకి కుర్చీల్లో ఫాను క్రింద కూర్చోవడం తప్ప రంగంలో మాకి పని చేయడం ఏం తెలుస్తుంది?"

ఫోన్ మరల గణ గణ లాడింది. గోపాల్ మాట్లాడటం ఆపి రిసీవర్ ఎత్తాడు.

"ఎస్ సర్. నేను సార్ సారథిని! సుశీలను ఎక్కించుకొన్న ఆటో స్టేషన్ రోడ్లో వెడుతోంది. నేను వెంటాడుతోన్నాను. ఆటో డ్రైవర్ తెల్లబట్టలు వేసుకున్నాడు.

వాళ్ళకి తోలు చెప్పాలు."

అవతల క్లిక్ మంది.

గోపాల్ క్లుప్తంగా శిరీష్‌కి విషయం చెప్పి, రిసీవర్ క్రెడిల్ చేశాడు. ఇద్దరూ బయటికి పరుగెత్తారు.

14

"హుష్...." నిస్త్రాణగా మంచంమీద వాలింది సుశీల. పైకప్పుకేసి చూచింది. ఏనాటిదో సీలింగ్ ఫాన్ తిరగనా ఆగనా అన్నట్టు తిరుగుతోంది.

గాలి తగులుతోన్నప్పటికీ ఆమె శరీరంలో వడదెబ్బ తగిలినట్టు ఉష్ణం పుడుతోంది.

ఫోన్ కాల్ విన్నప్పటినించీ దడగా వుంది. మరల రెండు గంటలకి ఫోన్ చేస్తాడట! సుబ్బరామయ్యకి చెప్పి తను వాడితో లేచిపోవాలట! తను ఎంతగా వీధినపడినా తనకో మనస్సూ, ఇష్టమూ వుంటాయని వూహించలేని మూర్ఖుడు! అసలు ఆ మూర్ఖుడెవరో!

సుశీల మనసు ఒక్క క్షణం ఆలోచనారహిత మయింది. వెంటనే కొత్త ఆలోచనతో బాటు వుత్కంఠ రేగింది. అవును. తనకి ఫోన్ చేసిందెవరు? అతడే భూష ణాన్ని చంపి ఉంటాడా?

సుశీల గుండె కొట్టుకోవడం ఆగిపోయింది కొన్ని క్షణాలపాటు.

సుశీల లేచి గూటిలో వున్న రిస్టు వాచీ తీసుకొని చూచింది. రెండు గంటలు కావడానికి ఇంకా అయిదు నిమిషాలుంది. ఆలోచించుకొంటూ గది బయటికి నడి చింది.

వంటవాడు సుశీలను చూచి "మధ్యాహ్నం భోజనం చేశావా?" అన్నాడు.

సుశీల నీరసంగా నవ్వి, "కాస్త మజ్జిగ యివ్వు. ఆకలిగా లేదు." అంది.

వంటవాడు లోపలికి వెళ్ళి మజ్జిగ తెచ్చి ఆమెకి యిచ్చాడు. ఆమె త్రాగి అతడికి గ్లాసు ఇస్తోండగా ఫోన్ గణ గణలాడింది.

సుశీల గబగబ ఫోన్ ఉన్న బల్లకేసి నడిచి రిసీవ రందుకొంది.

"సుశీలా!" అవతలనించి వినిపించింది.

"నే.... నే!" క్రీగంట చూచింది. వంటవాడు లేడు.

"బాగా ఆలోచించుకున్నావా?" అడిగాడు అవతల నించి.

'ఆ గొంతు ఎవరిదో తనకు పరిచయమున్న గొంతే! అయితే కావాలని ధ్వని మార్చి మాట్లాడటమో, నోటికి అడ్డంగా పల్చటి కాగితం పెట్టుకుని మాట్లాడ టమో చేస్తున్నాడు అతను.'

"ఏమిటి యింకా ఆలోచిస్తున్నావు?" అడిగాడు అతడు కంఠంలో దర్పం ధ్వనిస్తూ.

"నీతో ఎలా రాగలనూ? నువ్వెవరో నాకు తెలి యదు."

"సాంప్రదాయ వివాహాల్లో పెళ్ళి కూతురూ పెళ్ళి కొడుకూ ఒకరి ముఖ్కా మొహమూ ఒకరికి తెలియని వాళ్ళే!" అతడు నవ్వాడు.

"అయినా నువ్వు హంతకుడివి. హంతకుడితో నేను కాపురం చేయగలనని యెలా అనుకొంటున్నావు?"

అతడు పకపక నవ్వి, "ఇంతకీ నువు అర్థం చేసుకున్నది ఈమాత్రమేనా? భూషణాన్ని హత్య చేసింది నేను కాదు." అన్నాడు.

"అబద్ధం?" అరచింది సుశీల.

"నాదే అబద్ధం అయితే నాతో రావడానికి అభ్యంతరం లేదు కదా!"

"లేదు."

"వెరిగుడ్! నాతో బయల్దేరిరా. భూషణాన్ని హత్య చేసిన వాడిని చూపిస్తాను."

సుశీల ఆలోచించింది. "వస్తాను. ఎలా?" అంది.

అతడు చెప్పసాగాడు.

15

పోలీస్ జీపు సడెన్ బ్రేక్‌తో ఆగింది. బ్రేకులు కీచుమని శబ్దం చేశాయి.

టెలిఫోన్ బూత్ ప్రక్క జనం గుమిగూడి వున్నారు. శరీఫ్ గుండె దడ దడలాడింది. ఇక్కడినుండే సారధి అయిదు నిమిషాల క్రితం ఫోన్ చేశాడు.

శరీఫ్, గోపాల్ జీపులోంచి క్రిందకు దూకారు. బూత్ కేసి పరుగెత్తారు. గుంపును తప్పించుకొని మధ్యకి వెళ్ళి చూశారు.

సారధి బోర్లాపడి వున్నాడు.

శరీఫ్ కంగారుపడి వొంగి నాడి అందుకొని చూశాడు. తల పంకించాడు. సారథి జుత్తు నిమిరాడు. ఎత్తుగా బొప్పి తగిలింది చేతికి.

"ఫరవాలేదు. తలమీద కొట్టి స్పృహ తప్పించాడు." అని జేబులోంచి స్మెల్లింగ్ సాల్ట్ తీసి సారధికి వాసన చూపించాడు శరీఫ్.

సారధి మెల్లగా కదిలాడు. కళ్ళు తెరిచాడు. లేచి కూర్చోవడానికి శరీఫ్ సహకరించాడు,

"ఏం జరిగింది!" వొంగి కూర్చుండి అడిగాడు గోపాల్.

సారధి గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించసాగాడు.

16

ఆటోలో వెడుతోన్నప్పటికీ సుశీల ధైర్యంగానే ఉంది.

తను బార్ లోంచి బయటకు వచ్చి కొండ వారనే ఉన్న రోడ్డు పట్టుకుని నడుస్తోంది. ఫోన్ లో తనని అతడు ఆదేశించినట్టు జీడి మామిడి చెట్టు చాటున ఆగింది.

రోడ్డుకి అవతలనించి ఆటో వస్తూ కనిపించింది. తెల్లటి బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆటో తోలుతున్నాడు.

సుశీల గుండె దడ దడలాడింది.

'ఒకవేళ అతనే హంతకుడా?' సుశీల గుండె దడ దడలాడింది.

'అతడు డ్రైవర్. హంతకుడై ఉంటే అంత ధైర్యంగా ఆటో తోలుకుంటూ యెలా వస్తాడు.'

ఆటో తిన్నగా వచ్చి సుశీల ముందు ఆగింది.

"సాయంకాలం అవుతోంది!" అన్నాడు ఆటో డ్రైవర్.

"అవును పక్షులు ఎగిరి గూటికి చేరుకోవాలి." అంది సుశీల.

ఫోన్ లో మాట్లాడిన వ్యక్తి చెప్పిన సంకేతం అది!

సుశీల సందేహించకుండా ఆటో యెక్కి కూర్చుంది. ఆటో కదిలింది. అప్పుడే సారధి స్కూటర్ పై వెళుతూ తనని చూశాడు. సుశీల ఆటోలోంచి వెనక్కి తిరిగి చూచింది. ఆమె గుండె ఆనందంతో . గంతు వేసింది.

'సారథి స్కూటర్ మళ్ళించాడు. ఫరవాలేదు.. ఆటోని వెంబడిస్తాడు.' సుశీల తృప్తిగా నిట్టూర్చింది.

ఆటో సీతమ్మ ధార రోడ్డు వదిలి శాంతినగర్ పట్టింది. ద్వారకానగర్ మీదుగా దొండపర్తి దాటి స్టేషన్ రోడ్లోకి ప్రవేశించింది. వాల్తేరు రైల్వేస్టేషన్‌కి ఇవతల స్కూటర్ ఆగి ఉంది. ఆది సారధిదే! సందేహం లేదు. అంటే....సుశీల మనసులోనే సారధి నైపుణ్యానికి కృతజ్ఞతలర్పించుకుంది.

ఆటో స్టేషన్ దాటి బ్రిడ్జి క్రిందనుండి గోపాలపట్నం పోయే రోడ్లోకి తిరిగింది. సెయింట్ జోసెఫ్ కాన్వెంటుకి అవతల ఆగింది. డ్రైవర్ ఆటోలోంచి దిగాడు. ఆటో ప్రక్కనే నల్ల అంబాసిడర్ కారు ఆగింది.

డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తి ఫుల్ సూట్‌లో ఉండి మొహం కనిపించకుండా ఫెల్ట్ హేట్ పెట్టుకున్నాడు. ఆటో డ్రైవర్ సుశీలకి సైగచేసి కారులో వెనక డోర్ తెరచి పట్టుకున్నాడు.

సుశీల ఆటో దిగి కారు ఎక్కింది. ఆమె ప్రక్కగా ఆటో డ్రైవర్ ఎక్కి కూర్చున్నాడు.

అంబాసిడర్ ముందుకి బయలుదేరింది. జ్ఞానాపురం యివతల ప్రక్క రోడ్‌లోకి మళ్ళి తోటలకేసి పరుగులు తీసి జనం లేనిచోట ఆగింది.

"సుశీలా! కారులోవుండే మాట్లాడుకుందాం. నాతో రావడానికి ఒప్పుకున్నావు కాబట్టి చెబుతున్నాను. భూషణాన్ని హత్య చేసింది నీ ప్రక్కనున్న వ్యక్తి" అన్నాడు సూట్‌వాలా, తల త్రిప్పకుండానే.

సుశీల భయంగా ప్రక్కకి చూచింది. ఆమెకి ఒళ్ళు జలదరిస్తోంది. తన భూషణాన్ని మట్టుపెట్టిన వ్యక్తి ప్రక్కనేనా తను ఇంతసేపూ కలసి ప్రయాణించింది?

"నువ్వు అతడిని తెలుసుకున్నా పోలీసులకు పట్టించ

లేవు. మనం యిద్దరం ఈ చట్టాలకీ, కేసులకీ చాలా దూరంగా ఎగిరిపోతాం. గతాన్ని మరచిపోతాం!" అన్నాడు సూట్ వాలా.

సుశీల ముందుకి వొంగి, "నువ్వా!" అన్నది. ఆమెలో రేగిన వుత్కంఠకి అంతు లేకుండాపోయింది.

"అవును. నేనే!"

"హంతకుడివి నువ్వేనంటాను. నిన్ను ఇప్పుడే పోలీసులకు పట్టిస్తాను." పిచ్చిగా అరిచింది సుశీల.

"నోర్మూయ్. పోలీసులు ఎవరిని పట్టుకుంటే వాళ్ళే హంతకులు!" కోపంగా అరిచాడు సూట్ వాలా.

సుశీలలో భయమూ అసహాయతా చోటు చేసుకున్నాయి.

ఆటో డ్రైవర్ విండ్ స్క్రీన్ ఎత్తాడు. సూట్ వాలా ముందుడోర్స్ని ఎత్తాడు. సుశీల ఇద్దరినీ భయంగా చూచింది.

17

"ఆటోనా! చాలా ఆటోలు వెళ్ళాయి సార్! యెలా గుర్తుంటుంది సార్?" అన్నాడు బ్రిడ్జి సమీపంలో వున్న కానిస్టేబులు.

శిరీష్ ఓపికగా చూస్తున్నాడు.

గోపాల్, "ఆటో డ్రైవర్ లాగా అతడు కాకీ యూనిఫాంలో ఉండడు. తెల్లబట్టలు వేసుకున్నాడు. వెనక సీట్లో ఆడమనిషి ఒక్కతే వుంటుంది. గుర్తు తెచ్చుకో! ఈ దారిన వెళ్ళి అయిదు నిమిషాలు కూడా కాదు" అన్నాడు.

కానిస్టేబుల్ ఆలోచించి,గోపాలపట్నం పోయే రోడ్డు కేసి చూపించి యేదో చెప్పసాగాడు. అంతవరకూ జీపు

ఆగలేదు. రోడ్డును మింగేస్తూ జీపు సెయింట్ జోసెఫ్స్ కాన్వెంటు దాటుతోంది.

"అదిగో సార్! ఆటో! అదే! రోడ్డుప్రక్కన వుంది" అరిచాడు సారధి.

"అదే అని ఎలా తెలుసు?"

"ఆటో నెంబర్ యిందాక నాకు కనిపించలేదు. వెనక 'సర్కస్ రాముడు' అని రాసి వుండటం చూచిన గుర్తు" అన్నాడు సారధి.

వాహనాల వెనుక తమ అభిమాన నటుల సినిమా పేర్లు రాసుకోవడం విశాఖపట్నం అద్దె వాహనాల సొంత దారుల సరదా! శిరీష్ చిరునవ్వు నవ్వాడు.

జీపు ఆటో ప్రక్కగా ఆగింది. ఆటోలో ఎవరూ లేరు. శిరీష్ వొంగి వెనకసీట్లో చూశాడు. వాడిపోయిన పూల రేకులు రాలి వున్నాయి. సందేహం లేదు. సుశీల ప్రయాణించిన ఆటో ఇదే!

"గోపాల్! ఆటో హేండిల్ మీద హంతకులవి గానీ, హత్యకి సహకరించిన వారివిగానీ వ్రేలిముద్ర లుంటాయి. ఆటో దగ్గర ఎవరినైనా కానిస్టేబులును వుంచు" అన్నాడు శిరీష్.

గోపాల్ ప్రక్కనే వున్న పెట్రోలు బంక్ కేసి నడిచాడు. శిరీష్ పేవ్ మెంటుమీద కూర్చున్న ముసలి బిచ్చగత్తె దగ్గరకు వెళ్ళి, "మామ్మా! యెంత సేపట్నుంచి వున్నావు?" అన్నాడు!

"పొద్దుట్నించీ యిక్కడే వున్నాను బాబూ!" అంది బిచ్చగత్తె.

"అయిదు నిమిషాల ముందు యిక్కడో ఆటో ఆగింది. చూశావా?"

"చూశాను బాబూ! ఎవరో పడుచుపిల్ల కారెక్కింది. తెల్లబట్టలేసుకున్న కుర్రాడూ కారెక్కాడు."

"కారా? ఏ కారు?"

"నల్ల కారు బాబూ!" అంది ముసలావిడ.

"ఎలా వెళ్ళింది మామ్మా?"

చెప్పిం దావిడ.

శిరీష్ మామ్మ చేతిలో అయిదురూపాయల నోటు పెట్టి "చాలా సంతోషం మామ్మా!" అన్నాడు.

మామ్మ తెల్లబోయింది.

ఇన్‌స్పెక్టర్ గోపాల్ శిరీష్ దగ్గరకు వచ్చాడు.

"మా మనుషులు వస్తున్నారు. అంతవరకూ సారథిని యిక్కడ ఉంచి మనం వెళ్ళవచ్చును...." అన్నాడు గోపాల్.

శిరీష్ తలూపి సారథికేసి సాభిప్రాయంగా చూశాడు. సారథి ఆటోదగ్గర నిలబడ్డాడు. గోపాల్ జీపులో ఎక్కి కూర్చున్నాక శిరీష్ జీపు డ్రయివ్ చేయసాగాడు.

అడుగడుగునా జీపు ఆపి శిరీష్ దార్లో పోయేవాళ్ళని నల్ల అంబాసిడర్ కారును గురించి దర్యాప్తు చేస్తూ వచ్చాడు. అడిగీ అడిగీ అతనికి విసుగు పుట్టుకొస్తోంది.

"నల్ల కారా సార్! ఇప్పుడే తోటలోంచి యిలా రోడ్డెక్కి గోపాలపట్నం వైపు పోయింది సార్!" అన్నాడు రోడ్డు ప్రక్కనే వున్న కిళ్ళీ దుకాణంలోని వ్యక్తి.

"ఈ తోటలోంచా? అంబాసిడర్ కారేనా?"

"అవును సార్!" అన్నాడు అతను.

"తోటలోంచి రావడం యేమిటి శిరీష్?" అడిగాడు

గోపాల్.

శిరీష్ కిళ్ళీకొట్టతనికి కృతజ్ఞతలు చెప్పి, "ముందు తోటలోకి వెళ్దాం పద!" అంటూ మట్టిదారిలోకి జీపు మళ్ళించాడు.

శిరీష్ సడన్‌గా జీపు ఆపి, "కారు టైర గుర్తులు చెరగకుండా త్వరగా నడచి వెళ్దాం. దిగు గోపాల్!" అన్నాడు.

ఇద్దరూ జీపు దిగి టైర్ గుర్తుల వెంబడి నడవసాగారు. "కిళ్ళీకొట్టతను చెప్పింది నిజమే! అయిదు పది నిమిషాల క్రితమే అంబాసిడర్ ఈ దారిన వెళ్ళి మరల వెనక్కి తిరిగి వచ్చింది" అంటూ శిరీష్ వంగి టైర్ గుర్తులను పరిశీలించి, "సందేహంలేదు. అదే అంబాసిడర్ కారు! వెనుక టైర్లలో ఒకదానికి పెద్దసైజు నారింజతొన ప్రమాణంలో పెచ్చు లేనట్లు ముద్ర అదిగో!" అన్నాడు.

గోపాల్ నిట్టూర్చాడు. ఇద్దరూ చురుకుగా అడుగులు వేశారు. తోటలో చెట్లు వరుసలు వరుసలుగా వున్నాయి. ఒక చెట్టు ప్రక్కగా యెవరో పడుకున్నట్టు కాళ్ళు కనిపిస్తున్నాయి....యిద్దరూ పరుగు పరుగున అటు వెళ్ళారు.

సుశీల నేలమీద పడివుంది. ఒక చెయ్యి కింద వున్న ఎండుటాకులమీదా మరోచెయ్యి పొట్టమీదా వున్నాయి. తల ఒక ప్రక్కకు వాల్చి వుంది. మెడ ప్రాంతంలో ఎర్రగా కమిలిపోయి వుంది. నరాలు గాలి పోసుకున్నట్టు వుబ్బిపోయాయి. కళ్ళు పగిలిన పత్తికాయల్లాగా తెరుచుకుని ఉన్నాయి.

శిరీష్ వొంగి ముక్కుదగ్గర చెయ్యిపెట్టిచూసి పెదిమ విరిచాడు.

గోపాల్ ఒళ్ళు పట్టుకు చూచి, "కొన్ని నిమిషాల క్రితమే ప్రాణాలు పోయి వుంటాయి. పాపం! మనమే ఆలస్యం చేశాం!" అన్నాడు.

శిరీష్ నిట్టూర్చాడు.

18

డిటెక్టివ్ శిరీష్ కుర్చీలో వెనక్కి వాలాడు. ఆలోచనలతో అతడి తల వేడెక్కి పోతోంది. సుశీల తనని భూషణం హత్యకేసు పరిశోధించమని కోరింది. సుశీల డబ్బుకి ఆశించి ఈ కేసును టేకప్ చేయలేదు తాను. అయినా అడుగడుగునా తను సారధి ప్రాణాన్ని పణంగా పెట్టవలసి వస్తోంది. సారధి చురుకైన యువకుడు. తనవద్ద వుండి అపరాధ పరిశోధనలో శిక్షణ పొందుతున్నవాడు. రామ్మూర్తిని మారు వేషంలో వెంటాడమని పంపించాడు తను.

తనకి కేసు ఒప్పగించిన సుశీల హత్య చేయబడింది. గొంతు నులిమి మరీ హత్య చేశాడు హంతకుడు. సారధి వెళ్ళి గంట అయినా ఫోన్ చేయలేదు.

సుశీల గుర్తుకి రాగానే ఆలోచనల్లో ఎక్కడో కీలికి తగిలినట్టయింది. చటుక్కున ముందుకి వొంగి ఫోన్ దగ్గరకు లాక్కున్నాడు. రిసీవర్ చేత్తో తీసుకుని నెంబర్ డయల్ చేశాడు.

అవతలనుండి, "హలో...." అన్నాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

"నేను శిరీష్‌ని మాట్లాడుతున్నాను. ఎనాలిసిస్ వచ్చిందా?"

"వచ్చింది. నువ్వోసారి రా....!" అన్నాడు గోపాల్.

శిరీష్ వస్తున్నానని ఫోన్‌లో చెప్పి రాజ్‌దూత్ మీద బయలుదేరాడు.

"సుశీల గోళ్ళలో కనిపించిన మాంసం పోగులు మగవాడివి. గొంతు నులిమి హత్య చేసేటప్పుడు సుశీల ఆత్మ రక్షణకోసం హంతకుడిని బలంగా గిచ్చివుంటుంది. హంతకుడికి ముప్ఫయి-ముప్ఫయ్ అయిదు మధ్య వయసుంటుంది. ఆ యువకుడి చర్మంమీద నూనెమరకలూ, ఇతర మసాలా దినుసులూ, గ్లూకోజ్ అంటివున్న చిహ్నాలు ఎనాలిసిస్‌లో కనిపించాయిట!" అన్నాడు గోపాల్.

శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

"ఆటోమీద వ్రేలిముద్రలు?"

"అవి పాత నేరస్థుడివి కావు. అన్ని పోలీస్ స్టేషన్స్‌కి పంపించాను. అన్నట్టు ఆటో దొంగిలించబడినట్టు టూ టౌన్ స్టేషన్‌లో రిపోర్టు అందిందట."

"శవం మీద అంటే గొంతు మీద వ్రేలిముద్రలు లేవా?"

"ఉన్నాయి. అవి కూడా పాత నేరస్తులవి కావు."

శిరీష్ వొంగి అతనికి సూచనలివ్వసాగాడు.

19

దూరంగా పోల్ట్రీఫారం కనిపిస్తోంది.

టాక్సీని ఆపి మీటర్ ప్రకారం అద్దె చెల్లించి శిరీష్ రోడ్డుమీద నిలబడ్డాడు. టాక్సీ వెళ్ళిపోయింది.

డబ్బు తడుముకున్నట్టుగా చేత్తో పర్సు జేబును తడిమాడు. పైన వేసుకున్న కోటు అడుగున పిస్తోలు తగిలింది.

రోడ్డు వదలిపెట్టి డొంకదారిలో దిగి పోల్ట్రీఫారం వెనక్కి చేరుకున్నాడు. చుట్టూ చూశాడు—తనని ఎవరూ

గమనించలేదు.

ఫారం చుట్టూ నాలుగడుగుల ఎత్తులో పిట్టగోడ వుంది. పిట్టగోడమీద చేతులు ఆనించి అవతల ప్రక్కకి చూశాడు.

ఫారం షెడ్డు గాక ఒక ప్రక్కగా చిన్న తాటాకు షెడ్డు వుంది. కొత్త తాటాకులు.

శిరీష్ అటు నడిచాడు. షెడ్లోకి చూచి తల పంకించాడు. షెడ్లో చాటుగా వున్నట్టుగా అంబాసిడర్ కారు వుంది. నల్లరంగు కారు. శిరీష్ కారు వద్దకునడిచి వ్రేలితో నలుపు రంగుమీద రాశాడు. నలుపు రంగు చేతికి అంటుకుంది.

నీలంరంగు అంబాసిడర్ మీద మసిలాంటి పెయింటు పులిమారు. అంతే! అది నల్ల రంగు అంబాసిడర్ కారు కాదు.

శిరీష్ వెనక్కి తిరిగాడు.

20

సూది ఎర్రగా కాలింది. సూట్ వాలా పట్టకారుతో సూదిని పట్టుకుని సారథి దగ్గరకు వచ్చాడు. సారథి కుర్చీకి కట్టివేయబడి వున్నాడు.

"చెప్పు. ఎవరు నువ్వు. ఎందుకు మమ్మల్ని వెంటాడుతున్నావు?" అంటూ సూదిని అతడి శరీరంమీద వుంచడానికి వొంగాడు.

"ఆగు చెబుతాను" అన్నాడు సారథి.

సూట్ వాలా నవ్వి, "అలా దారికి రా" అంటూ నిటారుగా నిలబడ్డాడు.

'మొహం వంచు' అన్నట్టు సారథి సైగ చేశాడు. అతను సారథి మొహంమీద తల వొంచాడు. సారథి

నరాలు కూడదీసుకున్నాడు. ఒంట్లోవున్న కండరాలశక్తిని తలలో కేంద్రీకరించాడు. బలం కొద్దీ తల విదిలించాడు సారధి.

సూట్‌వాలా తలమీద సమ్మెట పడినట్లు గిలగిలలాడి వెనక్కి పడిపోయాడు. అతడి చేతిలో వున్న వెచ్చటి సూది అతడి తొడలో గుచ్చుకుపోయింది.

సూట్‌వాలా 'కెవ్వు'న అరిచాడు. బాధతో గిలగిల కొట్టుకున్నాడు.సూదిని తొడలోంచి బయటకు లాగాడు. మెల్లగా లేచి నిలబడ్డాడు. రెట్టించిన కోపంతో సారధి కేసి వచ్చాడు. పట్టకారుతో అతడి తలమీద బలంగా కొట్టాడు. సారధి తల ప్రక్కకి తిప్పాడు.

పట్టకారు సారధి భుజంమీద పడేలోపులో సూట్‌వాలా వెనక్కి కట్టెలాగా విరుచుకుపడిపోయాడు. సారధి ఆశ్చర్యంగా చూశాడు.

తలుపు చప్పుడు కాకుండా శిరీష్ ఎప్పుడు వచ్చాడో సారధిగానీ సూట్‌వాలాగానీ చూడలేదు. పట్టకారుతో కొట్టబోతోన్న సోట్‌వాలాని బలంగా మోకాళ్ళ వెనక భాగంలో తన్ని ప్రక్కకి తప్పుకున్నాడు శిరీష్. క్రింద పడిన సూట్‌వాలాని రెండు భుజాలమీద ఫెడీమని తన్నాడు శిరీష్.

సూట్‌వాలా మూలగసాగాడు. అతడి చేతిలో పట్టకారు లాక్కున్నాడు శిరీష్. చకచక సారధి కట్లు విప్పాడు.

“కణ్ణన్! నీ పార్టనర్ రామ్మూర్తి ఇప్పుడే గోపాల్‌కి దొరికిపోయాడు. ఇక నువ్వెన్ని వేషాలు వేసినా లాభం లేదు” అన్నాడు శిరీష్.

సూట్‌వాలా వేషంలో నేలమీద రొప్పుతోన్న కణ్ణన్ కళ్ళు మూసుకున్నాడు.

21

డిటెక్టివ్ శిరీష్ గౌరవార్థం పోలీస్ కమీషనర్ తన బంగళాలో విందు ఏర్పాటు చేశాడు. క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఇతర పోలీసు ఉన్నతాధికారులూ విందుకు హాజరయ్యారు.

"మిస్టర్ శిరీష్! కణ్ణన్‌మీద మీకు మొదటనుండీ అనుమానం వుందా? కేసు తికమకగా సాగింది. చివరకు కణ్ణన్ ప్రేమికు లిద్దరినీ చంపాడని యిప్పటికీ నమ్మలేక పోతున్నాము" అన్నాడు పోలీస్ కమీషనర్.

"ఈ కేసులో త్యాగరాజువలన, నల్లరంగుగా మార్చిన నీలంరంగు అంబాసిడర్ వలన కేసు చాలావరకూ తికమకగా తయారయింది. త్యాగరాజు తన బంధువులకు ఎవరో మాట యిచ్చి ఆ మాట నిలబెట్టుకోవడంకోసం భూషణాన్ని అతడి పాల్ట్రీఫారం అమ్మమని కోరాడు. అప్పటికే భూషణం నాలుగైదు చోట్ల పౌల్ట్రీఫారం అమ్ముతున్నట్టు ప్రచారం చేశాడు.

త్యాగరాజుకు పౌల్ట్రీఫారం అమ్మనని భూషణం ఎందు కనుకున్నాడో మనకి తెలియదు. అయితే నా వూహాలో ఒక విషయం తోచింది. భూషణం తన ఫారంని ప్రాణప్రదంగా చూసుకుని వుండాలి. అందుకే త్యాగరాజువంటి రౌడీమనిషికి అతడు ఫారం అప్పగించలేదు.

రామ్మూర్తి ఫారం కొన్నాక అతడిచ్చిన సొమ్ముతో నిషా బార్‌కి వచ్చాడు భూషణం.

సుశీలమీద భూషణానికి ప్రత్యేకమైన మమకారం వుంది. ఆమె శీలంమీద గాకుండా ఆమె బుద్ధిమీద అభి

మానం పెంచుకున్నాడు భూషణం.

భూషణం వ్యవహారం కణ్ణన్‌కి బాగా అర్థమయింది. రామ్మూర్తిని కలిశాడు. రామ్మూర్తి కృతఘ్నుడు. తనకి ఫారం అమ్మి భూషణంకు నెలకి రెండువందలు ప్రత్యేక లాభం యిస్తానన్నట్టు రామ్మూర్తి ఒప్పుకున్నాడు. ఈ రకంగా పదేళ్ళపాటు యివ్వాలి. అంటే ఇరవై నాలుగు వేల రూపాయల డబ్బు ఇంకా భూషణానికి రామ్మూర్తి ఇవ్వాల్సి వున్నాడు. అతను గనుక చనిపోతే డబ్బు తనకు మిగులుతుంది. రామ్మూర్తీ, కణ్ణన్ కలసి అతన్ని చంపేసి ఆ సొమ్ము దొంగిలించటానికి పథకం వేశారు. దొంగిలించిన డబ్బు, సుశీల కణ్ణన్‌కు దక్కుతుంది.

భూషణం సుశీలతో తమ వూరు వెళ్ళిపోయి సుఖపడతాడు. ఈ ఆలోచన కణ్ణన్‌ని బాగా ప్రేరేపించింది. భూషణం స్థానంలో తాను వుంటే! ఆ డబ్బుతో సుశీలతో సుఖజీవనం గడపవచ్చును. వీధిపిల్ల జీవితం కంటే సంసార జీవితం మెరుగు అని సుశీలకి తెలుసు. అదీగాక ఆ సంసార జీవితంలో భూషణం అయితేనేం? కణ్ణన్ అయితేనేం? యెవరైనా ఆమెకి ఒక్కటే—ఎవరో ఒక్కరే ఆవాలి. అంతే!—ఇదీ కణ్ణన్ ఆలోచన.

అయితే సుశీల కణ్ణన్‌ని పెళ్ళి చేసుకునేందుకు ఒప్పుకుని ఉండదు. పెళ్ళి చేసుకోమని అడిగేటప్పుడు కణ్ణన్ తన నిజస్వరూపం చూపించి వుంటాడు. సుశీల హంతకుడితో కలసి జీవితం పంచుకోలేనని చెప్పి ఉంటుంది. సుశీలను చంపక తప్పలేదు కణ్ణన్‌కి.

అయితే ఈ పనులన్నీ చేసేదీ చేయగలిగేదీ ఆమెతో బాగా పరిచయం వున్నవాళ్ళే. అలాంటి పరిచయం వున్న వాళ్ళమీదకు నా అనుమానం పోయింది. భూషణం హత్య

చేయబడిన సమయంలో కణ్ణన్ సరుకులు తెచ్చే మిషమీద హార్కెట్ వెళ్ళాడు. అది అతడి ఎలిబీ. అయితే అంబాడర్‌లో రామ్మూర్తితో కలసి తిరిగివచ్చి డబ్బు విత్ డ్రా చేసిన భూషణాన్ని చంపి వెళ్ళినట్టు ఎవరికి తెలుస్తుందిలే నుకున్నాడు.

అనుమానం త్యాగరాజుమీదకు వెళ్ళవచ్చును. ఎందుంటే అంతకు ముందురోజే భూషణం త్యాగరాజును హాశుద్ధి చేశాడు.

అసలు కణ్ణన్ సుశీలను కోరి తప్పు మరింత యెక్కువ శాడు. భూషణాన్ని వలచిన సుశీల కణ్ణన్‌ని ఎలా సద్దాటు చేసుకుంటుంది? ఆడదాని మనసు మైనం ముద్దారు-యే ముద్ర పడితే ఆ ముద్రను అచ్చు వొత్తుకోవనానికి! ఆ విషయం కణ్ణన్‌కి ఆమెను చంపవలసి వచ్చాకనీ తెలియలేదు.

సుశీల కణ్ణన్‌ని గాయపరిచింది. ఆమె గోళ్ళలోకంటిన క్తం, చర్మంపోగులూ కణ్ణన్‌వని రుజువైంది. అలాగే హోలో, అంబాసిడర్ కారులో దొరికిన వేలిముద్రలు కవురికీ సరిపోయాయి.

సారథిని రామ్మూర్తిపై నిఘా వుంచాను. అయితే రథినుండి యెటువంటి సమాచారం రాకపోవడంతో మ్మూర్తి పోస్ట్ మార్టంను ముట్టడించాము. నేరస్తులు పబడ్డారు" ముగించాడు డిటెక్టివ్ శిరీష్.

—:ఐపోయింది:—